# సాక్షి
## మానవ హక్కుల నిఘా

NEWSLETTER - 6 BI MONTHLY FOR PRIVATE CIRCULATION ONLY JULY- AUGUST : 2005



# దళిత స్త్రీలు - హక్కులు

...✍ శిరివెళ్ళ ప్రసాద్

ఆధునిక భారతదేశంలో స్త్రీల అభ్యున్నతి కోసం వారి విముక్తి కోసం ఉద్యమించిన మహాత్మాజ్యోతిరావ్ పూలే "స్త్రీ, పురుషులు ఇరువురూ సమానంగా స్వేచ్ఛగా జన్మించారని నమ్మేవారు, ఆనందంగా జీవించేందుకు సంపూర్ణహక్కులున్నాయని విశ్వసించే వారే సత్యారాధికులని" స్పష్టం చేశాడు. "స్త్రీలు కూడా దళితులే అని స్పష్టం చేసిన డా॥ బి.ఆర్. అంబేద్కర్ ఒక సందర్భంలో మహాత్మాజ్యోతిరావ్ పూలే గురించి మాట్లాడుతూ, మహాత్మాజ్యోతిరావ్ పూలే స్త్రీని విద్యావంతురాల్ని చేయడానికి ఉద్యమిస్తే నేను పురుషులతో పాటు స్త్రీల సమానహక్కుల కోసం నా మంత్రి పదవికి రాజీనామా చేశాను అని పేర్కొన్నాడు. డా॥ అంబేద్కర్ న్యాయశాఖ మంత్రిగా ఉన్నప్పుడు స్త్రీల సమాన హక్కుల కోసం హిందూకోడ్ బిల్లును రూపొందించాడు.

ఆ సందర్భంలో డా॥ అంబేద్కర్ విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో "సంఘం గతాన్ని విడిచిపెడుతున్నపుడు భవిష్యత్‌ను అంచనా వేసుకుంటున్నప్పుడు వివేకం ఒక్కటే గీటురాయి అవుతుంది. ఏ విషయాన్నయినా ఆ గీటురాయి మీద పరీక్షించి చూడాలి. అందుచేత పరస్పర వర్గాల మధ్య స్త్రీ, పురుషుల మధ్య అసమానత్వమే ఆత్మగా గల హిందూ వ్యవస్థని కూకటివేళ్ళతో సహా కుదిపి కదల్చకుండా మనం ఒకదాని తర్వాత ఒకటిగా కేవలం ఆర్థిక సంబంధమైన అంశాల మీదే చట్టాలు చేసుకొంటూపోతే ఈ రాజ్యాంగం ఎకసెక్కానికీ ఎగతాళికీ సరిపోయినది అవుతుంది." అన్నారు.

1989 నుండి అమలులో ఉన్న మండల కమీషన్ ఉత్తర్వులు కుల రాజకీయాలలో కొత్త అధ్యాయానికి తెరతీసాయి. ఈ పరిణామం అదే సమయంలో హిందుత్వ సిద్ధాంతాలు మరియు రాజకీయ అధికారం మరింత కఠినంగా వ్యవహరించేందుకు కూడా దోహదపడ్డాయి. దళిత స్త్రీల రాజకీయ పోరాటాలు మరియు కుల పునరుత్పత్తిలో భాగంగా లింగ ఆధారిత సిద్ధాంతాలకి ఆధారభూతమైన పాత్రల్ని నిర్ధారించడం పట్ల ఈ సందర్భంలో మనం అప్రమత్తంగా ఉండాలి. భారతీయ స్త్రీ వాద ఉద్యమంలో కులం చారిత్రక పాత్రని పోషించింది. స్త్రీవాద ఉద్యమపు మౌనాన్ని పట్టించుకొనితనాన్ని వెలివేతని దళిత బహుజన విమర్శకులు అనేక సందర్భాలలో ఎండగట్టడం జరిగింది.

నేడు గ్రామాల్లోని దళిత స్త్రీల స్థితి దుర్భరంగా ఉంది. ఈ దేశ మూలవాసులైన దళితులకు అందులోనూ దళిత స్త్రీలకు వారి పేరన ఒక సెంటు భూమి కూడా లేని విషయం మనకు తెలిసిందే. ఇలాంటి విపత్కర పరిస్థితుల్ని దాటుకొని దళిత స్త్రీ విముక్తి మార్గంలో పయనించాలంటే ఆమె ఏకకాలంలో అనేక పోరాటాలు చేయాల్సిన పరిస్థితి ఉత్పన్నం అవుతుంది. విద్య, వైద్యం మానవహక్కులు, సమానఅవకాశాలు, భూమి కోసం ఇంకా అనేకానేక అవసరాలుకోసం అన్ని రకాల వివక్షతలకి వ్యతిరేకంగా దళిత స్త్రీలు ఉద్యమించాల్సిన అవసరం ఏర్పడుతుంది.

భారతీయ సమాజం గురించి ఎవరెన్ని గొప్పలు చెప్పకున్నా, స్వయం సమృద్ధి చెందినది భారతీయ గ్రామం అని ఎన్ని గప్పాలు కొట్టుకున్నా, అదే గ్రామంలో పెంచి పోషించబడిన ఊహించడానికి కూడా అందని ఘోరమైన కులవ్యవస్థ నేడు గ్రామాల్లో ఉంది. అది క్రొత్త క్రొత్త రూపాల్లో నాగరికంగా పట్టణాల్లోకి కూడా వ్యాపించింది. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామాల్లో దళిత పురుషులు కుల అవమానాలని బయటి సమాజంతో అనుభవిస్తుంటారు. అయితే దళిత స్త్రీలు దళిత పురుషులు అనుభవించే అన్ని అవమానాలతో పాటు అదనంగా కుటుంబంలోని పితృస్వామిక భావజాలపు బాధలు పడుతుంటారు. వీటన్నింటినీ అధిగమించడానికి దళిత స్త్రీ చైతన్యవంతం కావాల్సిన అవసరం ఉంది. అందుకు పూలే, అంబేద్కర్ చూపించిన మార్గాన్ని అనుసరించాల్సిన అనివార్యమైన అవసరముంది. దీన్ని దళిత స్త్రీ గుర్తించి భావిసమాజాన్ని వివక్షలకి దూరంగా ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యతని స్వీకరించి ముందుకు అడిగిననాడే దళిత గుడిసెల్లో అంబేద్కర్ ఆశించిన వెలుతురు కిరణాలు ఉదయిస్తాయి. •

## దళిత్ కాల్ లైన్

**నెంబర్ : 040 55440969**

నేటి సమాజంలో కులవ్యవస్థ వేళ్ళు పాతుకొని పోయిన సందర్భంలో దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల ప్రజలు అనేక హింసలకు గురౌతున్నారు. కుల అకృత్యాలకు సాక్షులుగా ప్రత్యేకించి దళితులు, గిరిజనులు అందులోనూ స్త్రీలు మిగులుతున్నారు. అలాంటి ఘోరమైన పరిస్థితి హైటెక్ నగరమైన హైదరాబాద్‌లోని హయత్‌నగర్ నుండి ఒంగోలు వెంగముక్కల పాలెం వరకు అనేక ఘటనలు మనముందుకు వస్తున్నాయి. రాష్ట్రమంతటా ఇలాంటి పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో సాక్షి మానవహక్కుల నిఘా తన బాధ్యతల్ని తాను నిర్వర్తించు కుంటూ ముందుకు వెళుతుంది. ఆ క్రమంలో ఉన్న సమాచార వ్యవస్థని మరింత విస్తృతం చేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించి సాక్షి దళిత కాల్‌లైన్‌ని ప్రారంభించింది. దళిత కాల్ లైన్ **నెంబర్ 040-55440969** ని అందరి ముందుకు తీసుకొస్తున్నాం.

గ్రామాల్లో వివిధ ఉద్యమాల్లో ప్రజోపయోగ కార్యక్రమాల్లో పాల్గొంటున్న సామాజిక కార్యకర్తలు ఆయా గ్రామాల్లో జరిగిన **"రేప్, మర్డర్, సాంఘిక బహిష్కరణ, సామూహిక దాడులు, ఆస్తుల విధ్వంసం, లాకప్‌మరణాలు** మొదలైన వాటి వివరాలు పైన తెలిపిన నంబర్‌కి సత్వరమే తెలియజేయ వలసిందిగా కోరడమైనది.

ఇట్లు

**సాక్షి మానవహక్కుల నిఘా**

# దళిత స్త్రీలపై హింస - బహిరంగ విచారణ

## దళిత స్త్రీ శక్తి రిపోర్టు

**మహిళలు - హక్కులు :**

పితృస్వామ్యం, మతం, ఆచార వ్యవహారాలు, సంస్కృతి రూపాల్లో పౌర సమాజంలో మహిళలపట్ల అమలయ్యే, వివక్ష, అణచివేత అంతా ఇంతా కాదు. ఇది చరిత్రాత్మకం, ప్రపంచవ్యాప్తం, సర్వసాధారణం. యుద్ధంలో, శాంతిలో ఊహకందని విధంగా మహిళలపై నిరంతర హింస కొనసాగుతూనే వుంది. అది రెండవ ప్రపంచయుద్ధం కానీ, జాతి ఉన్మత్త సెర్బియా యుద్ధంకానీ, ప్రస్తుతం జరుగుతున్న ఇరాక్ ఆక్రమణ కానీ పెద్ద ఎత్తున సామూహిక అత్యాచారాలు, వేల సంఖ్యలో మహిళలను లైంగిక చిత్రహింసలు, అత్యాచార క్యాంపులు, బలవంతపు గర్భాలు జరుగుతూనే వున్నాయి. సెర్బియా గురించి గుజరాత్ దమనకాండ, తెలంగాణా నక్సలైట్ల అణచివేత వరకు సామూహిక మానభంగాలు, అత్యాచారాలు ఒకే పద్ధతిలో జరుగుతున్నాయి. ఇవి గాక బాలికల అపహరణలు, బలవంతపు వ్యభిచారం ఒక పరిశ్రమగా అభివృద్ధి చెందింది. ఇక శాంతి సమయంలో లైంగిక వేధింపులు, హింస, రోజువారీ మానభంగాలు అంతా ఒక ఎత్తయితే అవధుల్లేని కుటుంబ హింస, వరకట్న హత్యలు మరోఎత్తు. మహిళల హక్కులూ మానవ హక్కులేనని మహిళలు అంతర్జాతీయంగా ఎలుగెత్తి చాటా కొన్ని అంతర్జాతీయ చట్టాలు ఒప్పందాలు తేగలిగినా అవి అమలులో శూన్యం. అంతర్జాతీయంగా ఎన్ని చట్టాలు వచ్చినా, ఆ నేపథ్యంలో భారతదేశంలో గత రెండు దశాబ్దాల మహిళా ఉద్యమం ఫలితంగా ఎన్ని చట్టాలు వచ్చినా మహిళలపై దారుణహింస కొనసాగుతూనే వుంది.

**దళిత మహిళలు - హింస :**

భారత రాజ్యాంగం ప్రాథమిక హక్కుల్లో అధికరణం 14,15,16ల ద్వారా లింగ వివక్షను నిషేధించింది. ఆదేశిక సూత్రాలలోని అధికరణం 39, 44 మహిళా సమానత్వానికి దోహాదం చేసేవే. అదే విధంగా భారత శిక్షాస్మృతి, వరకట్న నిషేధపు చట్టం, నేర విచారణ స్మృతి, వ్యభిచార నిరోధక చట్టం, మహిళల అసభ్యకర చిత్రీకరణ నిరోధక చట్టం, సతీ చట్టం, లైంగిక నిర్ధారణ నిషేధ చట్టం, షెడ్యూల్డు కులాల, తెగల అత్యాచారాల నిరోధక చట్టం లాంటి చట్టాలు అన్నిటిలోనూ మహిళల హక్కుల గురించి ప్రస్తావన వుంది. ఇన్ని చట్టాలు వున్నా ఇవన్నీ ఆచరణ శూన్యమని వేరే చెప్పనవసరం లేదు.

మహిళాహక్కుల ఉల్లంఘన మన భారతదేశపు కుల, వర్గ నిచ్చెనమెట్ల వ్యవస్థలో దళిత మహిళల హక్కుల ఉల్లంఘన గానే ప్రధానంగా సాక్షాత్కరిస్తుంది. వెట్టిచారికీ, తక్కువ వేతనాలతో నికృష్టపు పనులు చేయడం, పాకీ పనిలాంటి పనులన్నింటిలో మనకు కనబడేది దళిత మహిళలే. బలవంతపు వ్యభిచారంలోకి నెట్టబడుతున్న అపహరించబడి పట్టణాలకు విదేశాలకు ఎగుమతి కాబడుతున్న బాలికలు దాదాపు అందరూ దళితులే. పోలీసుదాడుల్లో అత్యాచారాలకు గురయ్యేది కూడా భూస్వామ్య వర్గాలకు, అగ్రకులాలకు చెందినవారు వుండరనీ అంతా దళిత మహిళలనేది అందరికీ తెలిసిన వాస్తవం. పోలీసు కస్టడీలో జరిగే చిత్రహింసలు మానభంగాలు కూడా అత్యధికంగా దళిత మహిళలపైనే. మైనర్ బాలికలు జోగినిలుగా, దేవదాసీలుగా, బసివినిలుగా మార్చి గ్రామ లైంగిక వాంఛలు తీర్చే ఉంపుడుగత్తెగా మారుస్తున్నది కూడా దళిత బాలికలనే. దేశవ్యాప్తంగా జరుగుతున్న అన్నిరకాల మహిళలపై అత్యాచారాల నివేదికల్ని పరిశీలిస్తే వాటిలో 90 శాతం పైనే సంఘటనలు దళిత మహిళలపైనే, అనేది నిర్వివాదం.

దళితులపై అమలవుతున్న అణచివేత, కులవివక్ష ప్రభావం దళిత స్త్రీలపైనే ఎక్కువగా ఉంటుంది. దళిత స్త్రీలు అంటే మనం వెంటనే గుర్తుంచుకోవాల్సింది శ్రామికదళిత స్త్రీలు గ్రామీణ ప్రాంతంలో దళిత స్త్రీలు ప్రధానంగా వ్యవసాయ కూలీలుగా ఉంటారు. వీరిపై జరిగే అణచివేత రకరకాల రూపాల్లో ఉంటుంది. వీరు ఆర్థికంగా శ్రమదోపిడీకి గురి అవుతారు. తక్కువ కూలికే పని చెయ్యాలి. సంవత్సరము అంతటా పని దొరకదు. భర్త ఓ అసామి ఇంట్లో పాలేరుగా ఉంటే దళిత స్త్రీలు ఆ ఇంట్లో పాచిపని చేయటం సామాన్యంగా ఇలాంటి సందర్భాలలో లైంగిక దోపిడీకి గురవటం కూడా సాధారణంగా జరుగుతూంటుంది.

ఇది గాక దళితవాడపై దాడులు జరిగిన సందర్భాలలో స్త్రీలను మానభంగం చేయటం సాధారణం. దళితుల్ని అణచివేసేందుకు చేసే దాడుల్లో వారి మహిళలను మానభంగం చేయటం ఒక సాధనం, కక్ష సాధింపు చర్య. గ్రామీణ వాతావరణంలో, కూలి దొరకని పరిస్థితుల్లో బతుకు భారమై దళితులు ఇటీవలి కాలంలో పట్టణాలకు వలస పోతున్నారు. అలా వలస వచ్చినవారు మురికివాడల్లో నివసిస్తున్నారు. పట్టణాల్లో కూడా ఖచ్చితమైన దళితవాడలు, మురికివాడలు ఏర్పడ్డాయి. ఇక్కడ నివసిస్తూ పట్టణ జీవితంలో చిన్న చిన్న కూలి పనులకు, నిర్మాణ పనులకు లేదా పారిశుధ్యపు పనులకు మాత్రమే ఎక్కువభాగం దళితులు పరిమితమయ్యారు.

స్త్రీలు ఇళ్ళలో పాచిపనులకు వెళ్తారు. ఏవైనా పరిశ్రమలున్నా వాటిలో కూలిపనులకు, ఉదా:పొగాకు గ్రేడింగ్ పనులు లాంటివి మాత్రమే దళిత స్త్రీలకు దొరికేవి. ఇటీవలి కాలంలో ఇలాంటి పనులు కూడా పోయి జీవితం దుర్భరం అయిన పరిస్థితుల్లో వ్యభిచారంలోకి నెట్టబడ్డవారు కూడా ఉన్నారు. ఇకపోతే దళిత బాలికల పరిస్థితి ఘోరంగా ఉంది. చదివించలేని తల్లిదండ్రులు చిన్నతనం నుంచే వారిని పనుల్లో పెడ్తారు. దళిత బాలికలు అత్యాచారాలకు గురయిన సందర్భాల్లో ఎన్నో ఉన్నాయి.

అందుకే మహిళలపై హింస అంటే అది ప్రధానంగా దళిత మహిళలపై, హింస అని అర్థం చేసుకోవాలి. కూలి, వివక్ష, అత్యాచారాలు, కుటుంబ హింస, లైంగిక దోపిడీ తదితర దళిత స్త్రీ హక్కుల ఉల్లంఘనపై ప్రత్యేకించి పనిచేయాల్సిన అవసరం ఉన్నది. ప్రస్తుతం స్త్రీల హక్కులకై పనిచేసే సంస్థల్లో ఎక్కువభాగం ఫెమినిస్టు సంస్థలే. అందుకే దళిత స్త్రీ హక్కుల ఉల్లంఘనను ప్రజల దృష్టికి తేవాలనే ఉద్దేశ్యంతో వారిపై నిత్యం జరుగుతున్న అనేక రూపాల హింసలో కొన్ని మచ్చుతనకల్ని ఈ బహిరంగ విచారణ ద్వారా ప్రజలకు తెలియజేయాలని ఉద్దేశించి దళిత మహిళల హక్కులకై నడుం బిగించిన కొన్ని సంస్థలు ముందుకొచ్చి 'దళిత స్త్రీ శక్తి' గా ఏర్పడి ఈ బహిరంగ విచారణను చేపట్టాయి. ●

# దళిత స్త్రీ ఉద్యమం - నేటి చారిత్రక కర్తవ్యం

...✍ కత్తి పద్మారావు

దళిత స్త్రీ అంటే ఒక సామాజిక శక్తి. సాంస్కృతిక పతాక. శ్రమ జీవన సంస్కృతికి పట్టుకొమ్మ. సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా, మానసికంగా అణగద్రొక్కబడిన స్త్రీ దళిత స్త్రీ. అగ్రకులాల స్త్రీకి దళిత స్త్రీకి అనేక అంశాల్లో అంతరం ఉంది. అగ్రకులాల స్త్రీలు ఎక్కువమంది మానసికంగా కుటుంబపరంగా భర్త అరాచకంలో అణగద్రొక్క బడుతున్నారు. దళిత స్త్రీ కుటుంబ అణచివేతతో పాటు కుల అణచివేతను కూడా ఎదుర్కొంటుంది.

ఈనాడు గ్రామాల్లో దళిత స్త్రీల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వేలాది కుటుంబాలు వున్న దళితవాడల్లో దళిత స్త్రీ పేర ఒక ఎకరం భూమి కూడా లేదు. వేలాదిమంది డిపాజిటర్స్ వున్న బ్యాంకుల్లో దళిత స్త్రీకి ఒక పాస్‌బుక్ లేదు. తన పేర ఒక ఇండ్ల స్థలం లేదు. ఈ దేశంలో పుట్టి ఈ మట్టిని పిసుకుతూ తన శ్రమనంతా ఈ దేశ సౌభాగ్యానికి ధారపోస్తున్న దళిత స్త్రీకి 58 సంవత్సరాల స్వతంత్ర భారతంలో తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట. వుండడానికి ఇల్లు. తాగడానికి శుభ్రమైన నీరు, తన పిల్లల్ని బడికి పంపుకోవడానికి విద్యావసతి, తనకు పనిచేయడానికి ఉపాధి లేవంటే భారతదేశ పాలకవర్గం అగ్రకులాల వైపే పనిచేస్తుందనేది మనకు స్పష్టమైన విషయం.

దళిత స్త్రీలు ఈ పరిస్థితుల నుండి విముక్తి చెందాలంటే మొదటగా భూ పోరాటం చేయాల్సిన చారిత్రక అవసరం బలంగా ఈనాడు ముందుకు వస్తున్న అంశం. ఒక దళిత స్త్రీకి ఎకరం పొలమైనా ఇవ్వండని దళిత మహిళా సంఘం పెద్ద ఎత్తున పోరాటం చేసింది. ముఖ్యంగా మూడు లక్షల అరవై వేల దేవాదాయ ధర్మాదాయ భూములు కొనుగోలు చేసి దళిత స్త్రీలకు ఇవ్వాల్సిన చారిత్రక అవసరం ఉంది. 12 లక్షల 84వేల మిగులు భూములు ఇప్పటికీ పంచకుండా మిగిలి వున్నాయి. ఎన్నో సముద్రతీర ప్రాంత భూములు భూస్వాముల చేతుల్లో ఇరుక్కుని వున్నాయి. అయితే ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే తప్పకుండా వారికి భూమి పట్టా ఇవ్వడం వల్ల ఆత్మస్థైర్యం కలిగించవచ్చు. అయితే ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించడం లేదు. ఎప్పటి నుండో సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు ఇచ్చి లక్షల ఎకరాలు ఇచ్చినట్లుగా చెప్పుకుంటున్నారు.

దళిత స్త్రీలలో ఎక్కువమంది చిన్న వయస్సులోనే భర్తను పోగొట్టుకుంటున్నారు. దీనికి కారణం గ్రామాల్లో వున్న తాగుడు. వీధి వీధికి మద్యపానం షాపులు వుండడం వల్ల వీరు తాగుడు నుండి భర్తను ఆపలేక పోతున్నారు. తాగుడు బాగా పెరగడమే కాక ఈ తాగుడు అలవాటు అయిన ఐదు, పది సంవత్సరాల లోపే చనిపోతున్నారు. అప్పటికి ఇద్దరో, ముగ్గురో పిల్లల్ని కలిగి ఉండడం మళ్ళీ వేరు పెండ్లి చేసుకోక పోవడం ఏ విధమైన ఉపాధి లేకపోవడం వల్ల తీవ్రమైన సామాజిక ఒత్తిడిలకు గురై దుర్భరమైన జీవితాన్ని దళిత స్త్రీలు గడుపుతున్నారు. పొలాలకు పనులకు వెళ్ళినపుడు వీరు యుక్తవయస్సులో వుండడం వల్ల, వీరికి భర్తలేకపోవడం వల్ల భూస్వాముల అఘాయిత్యాలకు వీరు గురి అవుతున్నారు. భూస్వాముల హింస వీరి మీద నిరాఘాటంగా సాగుతుంది. ముఖ్యంగా నీళ్ళ పంపు షెడ్లలో, మంచినీరు తాగడానికి వెళ్ళినపుడు, వాళ్ళ పొలాల్లోకి ఒంటరిగా వెళ్ళినప్పుడు భూస్వాముల పిల్లలు వీరిపై అఘాయిత్యాలు చేస్తున్నారు. గ్రామంలో కూడా వీరికి రక్షణలేదు. ప్రభుత్వం వీరి ఆర్థిక సామాజిక విషయాల పట్ల నిర్లక్ష్యంగా వుంది. ఊర్లో పనులు లేక పిల్లలతో ఇతర ఊర్లు పనులకు వెళ్లడం అక్కడ అగ్రకులాల చావిళ్ళలో జీవించడం వారి అత్యాచారాలకు గురికావడం జరుగుతూ వస్తుంది.

అత్యాచారాలు అగ్రకులాల స్త్రీల కంటే దళిత స్త్రీలపైన ఎక్కువ జరుగుతున్నాయి. సరైన నివాసం ఉపాధిలేకపోవడం, అంటరానితనాన్ని రూపుమాపడం అంటే వారికి ఆర్థిక సామాజిక శక్తిని పెంచకపోవడం వలన ఈ అత్యాచారాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని ప్రస్థావిస్తూ 'షెడ్యూల్డు క్యాస్ట్ వుమన్' లో ఇలా పేర్కొనబడింది.

In April 1963, the Government of India appointed a committee under the chairmanship of L. Elyaperumal to go in the practice of untouchability in the country, the problem faced by the scheduled castes in education and the obstacles in the way of their economic upliftment. The report submitted in January 1969 dealt with the working of Untouchability (offences) Act and made a number of suggestions for its effective enforcement and the means of promoting the economic and educational interests of the scheduled castes. (Scheduled caste women - 24)

దళిత స్త్రీలలో విద్యని ఉపాధిని కల్పించడంలో తప్పకుండా ప్రత్యేక శ్రద్ధ చూపించవలసి వుంది. ఒక బ్రాహ్మణ స్త్రీ కులపరంగా హింసించ బడటం జరగదు. ఆమె కుటుంబంలో హింసించ బడుతుంది. దళిత స్త్రీ కుటుంబ హింస అగ్రకులాల కంటే ఎక్కువ వుంది. అనేక సందర్భాల్లో దళిత స్త్రీలని పురుషుడు కొట్టడం ఆనవాయితీ అయింది. హక్కుగా కూడా పరిగణిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అత్తలు కూడా కొట్టడం మనకు కనిపిస్తుంది. కుటుంబ హింస అగ్రకుల స్త్రీ కంటే ఎక్కువే ఉంటుంది. అదనంగా కుల హింస గ్రామాల్లో దారుణంగా వుంటుంది. తమ దగ్గరికి పనికివచ్చే స్త్రీలని ప్రతి పురుషుడు తక్కువగా చూడాలనే ప్రయత్నం చేస్తూనే వుంటాడు. ఇంటాబయటా ఒక యుద్ధంలా దళిత స్త్రీ జీవితం నడుస్తుంది. కారంచేడులో జరిగింది కూడా ఇదే అగ్రకులాల చెరువు ఎండిపోయిన సందర్భంలో దళితవాడలోని చెరువుకువచ్చి అక్కడ గేదెలకు కుడితినీళ్ళు పెట్టి, ఆ మిగిలిన నీళ్ళు చెరువులో పోస్తున్నప్పుడు మున్నంగి సువార్త అనే దళిత స్త్రీ ఇది తప్పు అని అన్నది. మీ చెరువుల్లో అలా పోయనిస్తారా? అని ప్రశ్నించింది.

వెంటనే పోతిన శ్రీను అనేక కమ్మ భూస్వామి చంద్రకోలు ఎత్తాడు. ఈమె ఎదురుగా బిందె ఎత్తింది. ఒక దళిత స్త్రీ కమ్మవాళ్ళ మీద బిందె ఎత్తుతుందా? అని వేలాదిమంది పోగై బరిశలు, గండ్రగొడ్డళ్ళు, సరిగబాదులు తీసుకొని దళిత పల్లెమీద దాడిచేశారు. ఈ పోరాటం ప్రతి పల్లెలో దళిత స్త్రీలు చేస్తూనే వుంటారు. దళితుల్లో పురుషుల కంటే స్త్రీలు శక్తివంతమైన వాళ్ళు అనేక సందర్భాల్లో పురుషులు భూస్వాములకు తొత్తులుగా వ్యవహరిస్తుంటారు. ముఖ్యంగా సారాయి ప్రలోభాలకు లొంగుతుంటారు. అయితే దళిత స్త్రీలు మాత్రం ఈ విధమైన ప్రలోభాలకు లొంగరు. వాళ్ళు ఆత్మాభిమానంతో తమ పిల్లల్ని చదివించుకోవాలని తమ ఇల్లును చక్కదిద్దుకోవాలి తమకు కొద్దోగొప్పో భూమిని సంతరించుకోవాలని వారు ఆరాట పడుతుంటారు. అందుకే ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన దళిత ఉద్యమం మొత్తం స్త్రీలతోనే ప్రధానంగా జరిగింది. ఒక ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు మొత్తం భారతదేశంలోనే తమ ఆత్మగౌరవం కోసం నిరంతరమైన పోరాటాన్ని దళిత స్త్రీలు చేస్తున్నారు. ఇది ఈ రోజు నుంచి కాదు అనాది నుండి జరుగుతున్న పోరాటమే.

The Aryan system and scriptures prevent the low caste groups from acquiring social mobility and forces them to remain backward by excluding them from the ownership and utilization of regional resources. The low caste group forms the polluted group in accordance with the traditional purity - pollution principle. The crucial concept is that the group which does not own the means of production is the polluted one and belongs to the scheduled caste. (Page - 55)

అసలు దళితులకు భూమి లేకపోవడానికి కారణం ఈ కులవ్యవస్థ. ఆంగ్లేయుల నుంచి భారతీయులు భూమిని పట్టా తీసుకున్న సందర్భంలో దళితుల్ని ప్రక్కనబెట్టారు. వీళ్ళు అస్పృశ్యులు అన్నారు. మంచి నీళ్ళే తాగడానికి అర్హతలేని వారికి భూమి ఏమిటి అన్నారు. భూమి చేతులు మారే టైంకి దళితులకు భూమే లేకుండా పోయింది. 1850 కాలానికి వీళ్ళని గ్రామాల్లోకే రానివ్వడం లేదు. 1925లో డా॥ బి.ఆర్. అంబేద్కర్ మహద్ చెరువు పోరాటం ప్రారంభించిన తర్వాతే నిజమైన సాంఘిక పోరాటం ప్రారంభమైంది. ఆనాడు కూడా అంబేడ్కర్‌కు అండనిచ్చింది దళిత స్త్రీలే. హిందువులకు వున్న అనేక నమ్మకాలు దళితులకు వుండడం వల్ల దళిత స్త్రీల విద్య ప్రవేశం చాలా ఆలస్యంగా జరిగింది. వాళ్ళు నాట్లు, కోత, కలుపులు తీసేవాళ్ళుగా మిగిలిపోయారు. ఎక్కువమంది ఐదో తరగతిలోపే ఆగిపోయారు. బాల్యవివాహాలు దళిత స్త్రీలకు నిత్యకృత్యమైనాయి. శరీరశక్తి తక్కువ అవడం వల్ల వాళ్ళు శారీరకంగా కూడా బలహీనంగా వుండడం జరిగింది. అంబేడ్కర్ నుండి ప్రారంభమైన దళిత ఉద్యమంలో ప్రతి సందర్భంలోనూ స్త్రీలే ముందువున్నారు. అగ్రకులాల స్త్రీలకు, దళిత స్త్రీలకు మధ్య ఈ కుల తారతమ్యం ఎందుకుంది అని ఇప్పుడు విద్యావంతులైన దళిత స్త్రీలు ప్రశ్నిస్తున్నారు. దళిత స్త్రీల ఆత్మగౌరవ పోరాటం అనేది పునాది అంశాలతో పూనుకొని వుంది.

ఊరు, కుటుంబం, పరిపాలన, పోలీస్‌స్టేషన్, యం.ఆర్.ఓ ఆఫీసు, భర్త అందరూ తనను అణచివేయాలని చూస్తున్న దశలో దళిత స్త్రీలు సంఘటితమై ఛలో హైదరాబాద్ (2003 మార్చి 7,8) 50వేల మంది సమీకృతమై గొప్ప పోరాటం చేశారు. ఈ పోరాటం కార్మికుల్ని సంఘటితం చేయడం, రాజ్యాంగ హక్కుల కోసం ఒక ఉమ్మడిపోరాటం చేయడం కోసం సామర్థ్యాన్ని సంతరించుకొని ఒక చారిత్రాత్మక కర్తవ్యంగా జరిగింది. దళిత స్త్రీలను సమీకరించడానికి అనేక అడ్డంకులు గ్రామాల్లో వున్నాయి. వీరు సంఘటితపడి ఉద్యమాలకు వస్తున్నప్పుడు వీరిని అపహాస్యం చేస్తారు. కుటుంబాల్లో భర్తలు రానివ్వరు. కొన్ని మీటింగులకు వచ్చినా తరువాత అడ్డుకుంటారు. వీటన్నింటిని అధిగమించి నాయకత్వ లక్షణాలు రూపొందించుకోవడానికి వీరు నిరంతర ఘర్షణ చెందుతూనే వున్నారు. అనేక సందర్భాల్లో అగ్రకుల స్త్రీలల్లో వున్న సానుభూతి పరులతో కూడా వీరు ఐక్య సంఘటన కడుతూనే వున్నారు. అగ్రకుల స్త్రీలకు లోతైన జీవన సంఘర్షణలు అర్థం కావడం లేదు. కొంతలో కొంత బి.సిలు భూమి పోరాటంలో వీళ్ళతో కలసి వస్తున్నారు. అస్పృశ్యతను గురించి తెలియని వారికి అస్పృశ్యతను అనుభవిస్తున్నారు ఆసమస్యను గురించి ఎంత చెప్పినా అర్థం కాదు. అది మానసిక వ్యథ. గుండె కోత, కులం పేరుతో దూషించడం ఈ కులం వారికి చదువుకునే హక్కు, భూమిని దున్నేహక్కు లేదనే భావం ఇంకా గ్రామాల్లో వున్న అగ్రకుల స్త్రీలల్లో, పురుషులల్లో పాతుకుపోయింది. ఈ కుల భావాన్ని ఈ కులతత్వాన్ని కులాధిపత్యాన్ని తొలగించవలసిన బాధ్యత ఈనాటి సామాజిక ఉద్యమాలకు ముందున్న సవాల్.

దళిత స్త్రీలలో వృద్ధులది ఇంకా దయనీయమైన పరిస్థితి. పనిచేయలేక, చూసేవారు లేక, నివాసం లేక సూరుల క్రింద ఆరిపోతున్న క్రొవ్వత్తుల్లా వీళ్ళు జీవిస్తున్నారు. ఒక టీ తాగే పరిస్థితులు కూడా లేక తమ శ్రమ శక్తితో ఏ కొడుకులను చదివించారో వారు నిర్లక్ష్యం చేయడం వలన ఎందరో తల్లులు దీనంగా జీవిస్తున్నారు. మండలానికి ఒక వృద్ధాశ్రమం పెట్టి వీరిని ఆదుకోవాల్సిన చారిత్రక అవసరం బలంగా వుంది.

ప్రపంచమార్కెట్టు విస్తరిస్తున్న సందర్భంలో భౌతిక శ్రమకు పనిరోజులు తగ్గుతున్న సందర్భంలో వ్యాపార రంగాల్లో దళిత స్త్రీలు కూడా ముందుకు దూసుకెళ్ళవలసిన పరిస్థితి వస్తుంది. నల్లజాతి స్త్రీలు హేర్‌హోస్టెస్‌ల నుండి గవర్నర్ల దాకా ఎదుగుతుంటే దళిత స్త్రీలు అంటురోగాలతో కునారిల్లుతున్నారు. ప్రతి జిల్లాలో పారిశ్రామిక ఓడలు నిర్మించి అత్యున్నతమైన జీవన ప్రమాణాలు పెంచడం కోసం ఉత్పత్తిరంగంలో వీరికి సమానస్థాయి కలిగించి ఆత్మగౌరవాన్ని రూపొందించవచ్చు. దీనికోసం ఎవరో వచ్చి పోరాటం చేస్తారు. ఏవో సంస్థలు సహాయం చేస్తాయి. అనేకంటే వేలాది మంది తమ రాజ్యాంగపు హక్కుగా ఈ పోరాటాన్ని చేసుకోవాల్సిన బాధ్యత దళిత స్త్రీలపై వుంది.

అగ్రకుల స్త్రీలు మానసిక వికాసానికి సంబంధించి సాహిత్యరంగాల్లో ఎక్కువ కృషి చేస్తున్నారు. కాని భాషకు సంస్కృతికి

( తరువాయి 14వ పేజీలో ..... )

# నేటి సమాజం - దళిత స్త్రీలు

...✍ - జి. ఝాన్సీ

బానిసత్వానికి, నికృష్టపు జీవితాలకు నిలువుటద్దాలు దళిత స్త్రీల జీవితాలు. బానిసకొక బానిసకొక బానిస అనే చందంగా ఈ కులవ్యవస్థలో దళిత స్త్రీలు అట్టడుగువారు. వర్గం, కులం పురుష పెత్తనాల క్రింద నలుగుతున్న దళిత స్త్రీ జీవితాలు ఏ కోణం నుండి చూసినా తేటతెల్లమవుతాయి. ఎన్ని వుద్యమాలు చేసినా స్త్రీల పరిస్థితే మన సమాజంలో రెండవ స్థాయిలో వుంటే ఇక దళిత స్త్రీల పరిస్థితి కడుదయనీయంగా వుంది. సామ్రాజ్యవాద విష సంస్కృతి కోరల్లో పెట్టుబడిదారీ వ్యవస్థలో దళిత స్త్రీ పరిస్థితి ఘోరమే వీరిపై జరిగే అణచివేత రకరాల రూపాల్లో వుంటుంది. ఆర్థికంగా శ్రమ దోపిడీకి గురౌతారు. ఆసాముల చేతుల్లో లైంగిక దోపిడీకి గురౌతారు. పనికి తగ్గవేతనం లేకపోవడం, వెట్టిచాకిరికీ, పాకీ పని, బలవంతపు వ్యభిచారంలోకి నెట్టబడడం, విదేశాలకు ఎగుమతవుతున్న దళిత బాలికలు, పోలీసుదాడుల్లో అత్యాచారాలకు గురయ్యేవారు, పోలీసు కస్టడీల్లో జరిగే చిత్రహింసలు, మానభంగాలు, దళిత బాలికల్ని జోగినిలుగా, దేవదాసీలుగా, బసివినీలుగా మార్చడం ఈ రూపాలన్నీ కూడా దళిత స్త్రీలవే. దళితులపై అమలవుతున్న అణచివేత, కులవివక్ష ప్రభావం దళిత స్త్రీల పైనే ఎక్కువ. అంతేగాక దళితవాడలపై దళితేతరులు దాడులు చేసే సందర్భాల్లో దళిత స్త్రీలను మానభంగం చేయడంలాంటి కక్ష సాధింపు చర్యలు సర్వసాధారణం.

ఇది ఒక కోణమైతే చదువుకుని ఉద్యోగాలు చేస్తున్న స్త్రీలు పడే బాధలు వర్ణణాతీతం. తక్కువ కులం నుండి వచ్చారనే భావనతో పై అధికారులు వేధించడం సర్వసాధారణం.

దళిత స్త్రీలు వీరి చరిత్రను తిరగేస్తే మాత్రం ఒక్కొక్కరు ఒక్కొక్క నిప్పుకణం. అందుకే ఏ పోరాటాలైనా, ఏ ఉద్యమాల చరిత్ర తిరగేసినా దళిత స్త్రీల పాత్ర గణనీయమైనది. కానీ ఇంతవరకు జరిగిన అనేక ఉద్యమాల చరిత్రలో గానీ, దళిత ఉద్యమాల్లో కానీ ఎక్కడా దళిత స్త్రీలు నాయకులుగా లేరు. కారణం ఏంటి? వారికి పోరాట పటిమలేకనో, వారికి స్ఫూర్తి లేకనో కాదు. ఏ పోరాటాలైతే దళితులను, కులసమస్యను గుర్తించలేదని గగ్గోలుపెడుతున్నామో ఆ పోరాటాలలో సైతం దళిత పోరాటాలు కూడా దళిత స్త్రీలను వెనక్కినెట్టడంలో, అణచివేయడంలో ఏమీ తక్కువ నేర్వలేదు. కొన్ని సందర్భాల్లో ప్రస్తుత వ్యవస్థకు భయపడి దళితేతరులైనా దోపిడీలు ఆపుతున్నారు కానీ దళిత పురుషుల అరాచకాలు మాత్రం ఇంటా బయటా కోకొల్లలు.

ఈ నేపథ్యంలో విముక్తి కోసం, సమానత్వం కోసం, అంటరానితనం నిర్మూలన కోసం దళిత ఉద్యమాల్లో పోరాటాలు జరుపుతూనే తన ఉనికి కోసం, సమానత్వం కోసం, స్వేచ్ఛ కోసం ఆత్మగౌరవ పోరాటాలు జరిపే దిశలో భాగంగా 'దళిత స్త్రీ శక్తి' ఆవిర్భవించింది. బిడ్డను కంటున్న తల్లికి పురిటి నొప్పులెంత సహజమో దళిత స్త్రీ 'శక్తి'ని చూపించడం కూడా అంతే కష్టం.

ఇలా ఆవిర్భవించిన దళిత స్త్రీ శక్తి రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా దళిత స్త్రీలపై జరుగుతున్న హింసను బహిరంగ విచారణ ద్వారా విజయవాడలో 15 మంది బాధిత మహిళలతో జరపడం జరిగింది. జ్యూరీ సభ్యులుగా దళిత మహిళా మేధావులు వుండడం ఈ బహిరంగ విచారణ ప్రత్యేకత. ప్రధానమైన కుటుంబహింస, వృత్తిహింస, అంటరానితనం రూపాలను ఈ విచారణలో వెల్లడించారు. తదనంతరం జరిగిన బ్రహ్మాండమైన ర్యాలీ, దళిత స్త్రీల సమూహంతో దళిత స్త్రీల నాయకత్వంతో ప్రధానకూడళ్ళన్నీ తిరుగుతూ విజయవాడ లెనిన్‌సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి సభ జరిగింది. దళిత నాయకుల మద్దతులో జరిగిన ఈ సభ దళిత స్త్రీ శక్తికి మంచి బలాన్నిచ్చింది. అదే రీతిలో దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో దళిత స్త్రీలపై హింసను రౌండ్‌టేబుల్ సమావేశం ద్వారా నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ప్రభుత్వ అధికారులు, సామాజికవాదులు, సీనియర్ న్యాయవాదులు, ప్రజాస్వామికవాదులు, స్త్రీ సంఘాల నాయకులు, మీడియా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రవేశపెట్టిన 8 కేసులు వచ్చిన ప్రతినిధులను కంటతడిపెట్టించాయి. దళిత స్త్రీల భవిష్యత్తు మారాలని, మార్చడానికి ఎన్ని అతీత శక్తులనైనా ఎదిరించాలని దళిత స్త్రీల గుండెల శపథాల చప్పుళ్లు ప్రతిధ్వనించాయి. అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేమనేది నగ్నసత్యం అని మరోసారి ఈ సంఘటనలు గుర్తు చేసాయి.

## పరిశ్రమల్లో స్త్రీలపట్ల కొనసాగుతున్న వివక్ష

సరళీకరణ క్రమంలో పనిచేసే ఆడవాళ్ళు లేబర్ మార్కెట్లలో వివక్షకి గురౌతున్నారు. ఈస్టడీలో గార్మెంట్‌ల తయారీ పరిశ్రమల్లో ఆడవాళ్ళకి ఎదురౌతున్న సమస్యల్ని పరిశీలించడం జరిగింది. ఉద్యోగం విద్య మరియు నైపుణ్యాల ఆధారంగా ఇస్తున్న సందర్భంలో ఆడవాళ్ళు అసమ అవకాశాలకి గురౌతున్నారు.

వివక్షత అంశం ఉద్యోగం మరియు వేతనాలు అనేవి పనిచేసే మగవాళ్ళతోపోల్చి చూస్తే సమానంగా లేవు.

సి.డి.ఎఫ్ విభాగాల్లో పనిచేస్తున్న పురుషుల, స్త్రీల ఆదాయాలు నెలకి (క్రింది విధంగా ఉన్నాయి)

| విభాగం | టైలర్ మొదటి గ్రేడు | | టైలర్స్ సెకండ్‌గ్రేడ్ | |
|---|---|---|---|---|
| | పురుషులు | స్త్రీలు | పురుషులు | స్త్రీలు |
| సి | 2600 | 2100 | 1800 | 1600 |
| డి | 2000 | 1800 | 1600 | 1600 |
| యఫ్ | 2500 | 2200 | 2000 | 1800 |

**వివిధ విభాగాల్లో ఇస్తున్న వేతనాలు (నెలకి)**

| విభాగం | సూపర్‌వైజర్స్ | టైలర్స్ | హెల్పర్స్ |
|---|---|---|---|
| ఎ | 5300 | 2500 | 1500 |
| సి | 4800 | 2000 | 1200 |
| డి | 4000 | 2000 | 1300 |

# దళిత ఉద్యమ బాటలో .....

...✍ - పి. చంద్రశ్రీ

నేను ఎనిమిదో క్లాస్ చదువుతున్న రోజులవి. విద్యార్థుల స్కాలర్‌షిప్ పెంచాలంటూ స్టూడెంట్స్ యూనియన్ వాళ్ళు క్లాసులు బాయ్‌కాట్ చేయిస్తున్నారు. కొంతమంది డప్పులు కొడుతూ పాటలు పాడుతున్నారు. విద్యా విధానంలో మార్పుల గురించీ, మహిళల గురించీ పాడుతున్నారు. ఆ పాటలన్నీ చాలాశ్రద్ధగా విన్నాను. అప్పుడు నేను కచేరీ సింగర్‌ని. డ్రామాలకు, పాట కచేరీలలో పాటలు సినిమా పాటలు, పాడే దాన్ని ఆ రోజు వాళ్ళ పాటలు నన్ను కదిలించాయి. వారం రోజులు ఆ పాటలే చెవుల్లో మార్మోగాయి. తొమ్మిదో క్లాసులో వుండగా కూడా బస్‌స్టాండుల్లో ఐదే టీమ్ పాటలు పాడింది. అక్కడే ఆగిపోయి వింటు వున్నాను. మా అక్కయ్య నా వీపు మీద ఒక్క దెబ్బ చరిచి 'పదా ఇంటికి ' అని నాచెయ్యి పట్టుకు గుంజుకు వెళ్ళింది. టెన్త్‌క్లాసు అయిపోయే వరకు నాలుగయిదుసార్లు వాల్లు వీధుల్లోపాటలు పాడటం విన్నాను.

ఇంటర్‌లో జాయిన్ కావడానికి కాలేజీకి వెళుతుంటే గేటు ముందు నిలబడి పాటలు పాడుతూ నూతన విద్యార్థులకు స్వాగత మంటూ కరపత్రాలు పంచారు. అప్పుడు వారిని నేనే పలకరించాను. పాటలు పుస్తకాలున్నాయా అని అడిగాను. అలా వాళ్ళతో పరిచయాలు పెరిగాయి. కాలేజీ యానివర్సరీకి నేను పాడినపాటలు వాళ్ళు విన్నారు. మెచ్చుకున్నారు. ఇన్నాళ్ళు మాతోమాట్లాడటమే చూశాం. నువ్వు బాగా పాడుతున్నావంటూ ఆ టీమ్ లీడర్ చాలాసేపు మాట్లాడాడు. వాళ్ళతో రిహార్సల్స్ చేసి పాటలూ, డ్యాన్సులూ నేర్చుకున్నాను. అప్పటికి నేను శాస్త్రీయసంగీతం నేర్చుకుంటున్నాను. ఇది తెల్సి శాస్త్రీయ సంగీతం అర్థం కాని భాష అనీ అది కొందరి కోసమేననీ, పనిలేని వారి కాలక్షేపం కోసమని చెప్పారు. స్వర సాధన అత్యవసరం అని తెలిసి కూడా కళ ప్రజలకోసం ఉపయోపడేదిగా వుండాలన్న వారి వాదనతో అంగీకరించక తప్పలేదు. దాంతో సంగీతం క్లాసులు మానేశాను.

ఒకసారి వేదిక మీద చిన్ని తమ్ముయ్యపాట, అరుణపతాకమా పాట పాడాను. ప్రజల నుండి వచ్చిన ప్రశంస చాలా సంతోషం కల్గించింది. నన్ను వాళ్ళ ఆప్తురాలిగా చూడటం మరింత బలంచేకూర్చింది. ఆ రోజు పాడటం మా అన్నయ్య మా బాబాయిలు విన్నారు. అ వేదికల మీద పాడటం ఎంత డేంజరో నీకు తెల్సా అంటూ నాన్న గదిలోకి తీసికెళ్ళి తలుపులు వేసి బెల్టుతో నా ఒళ్ళు చీరేలా కొట్టాడు నాన్న. నా జీవితంలో భయపడే విధంగా దెబ్బలు తిన్నది ఆరోజే. చాలా అవమానం అనిపించింది. నా ఒంటి మీద దెబ్బలుచూసి, భయపెట్టాలనుకొని ఇన్ని దెబ్బలు కొట్టానేంటీ అని కళ్ళనీళ్ళు పెట్టుకొని క్షమించమని అడిగాడు. అయినా వాళ్ళు పాటపాడినందుకు ఆ విధంగా కక్ష కట్టి నన్ను కొట్టడం నేను సహించలేకపోయాను. మర్నాడు కాలేజీకి వెళ్ళకుండా ఓ కామ్రేడ్‌ను కలిసి నాపై పడ్డ దెబ్బలుచూపించి ఇంక మాయింటికి వెళ్ళను మీతోనే వుంటానని చెప్పాను. కాదు ఇంటికి వెళ్ళమన్నారు.

రెండు రోజులయ్యాక (1985) హైద్రాబాద్‌లో సభలు జరుగు తున్నాయి. వారి వెంట రమ్మన్నారు. రెండు జతల బట్టలు సర్దుకుని ఇంట్లో ఎవరూ చూడకుండా బయల్దేరాను. చాలా మందిమి రైలెక్కాం. ఖాజీపేట వరకూ బండిలో పాటలు పాడుతూనే వెళ్ళాం. అక్కడ వేలాది కార్యకర్తల్ని పోలీసులు లాఠీఛార్జీ చేసి దింపేశారు. వాళ్ళలో నేనూ వున్నాను. అందర్నీ వరసగా పోలీస్‌స్టేషన్ ఎదుట కూర్చోబెట్టారు. కొందర్ని పిల్చి ఏదేదో అడుగుతూ కొడుతున్నారు. సభలకు వెళ్ళనీయ కుండా వచ్చిందారిన వెళ్ళమని పోలీసులు చెప్పారు. అక్కడి నుడి ఒక గూడ్సు ఎక్కి ఎలాగో తిరిగి ఇల్లు చేరుకున్నాను. తోటి కార్యకర్తల పాటలు, నినాదాలు నాలో కొత్త ఉత్సాహాన్ని నింపాయే గానీ పోలీసులు కొట్టిన దెబ్బలకు భయం మాత్రం కలగలేదు. ఇలా పార్టీకి దగ్గరయ్యాను ఇంట్లో ఇష్టం లేకుండానే పార్టీ కార్యకర్తతో పార్టీ పెద్దలే నాకు పెళ్ళి చేశారు. కుటుంబం నుండి దూరమైతేనేం నాకు ఎంతమంది అండదండలు న్నాయో అని ధైర్యం తెచ్చుకున్నాను.

పెళ్ళైన 13 రోజులకే నేను రాజమండ్రి రైతు కూలీ మహాసభల ప్రచార నిమిత్తం వెళ్ళి అరెస్టయ్యాను. 10 రోజులు లాకప్‌లో వుంచి ఆ తర్వాత సెంట్రల్ జైలుకి పంపారు. ఆ పదిరోజులు లాకప్‌లో వుండగా సరైన తిండిలేక బాగా ఆకలి వేసేది వాళ్ళందరిలో నేనొక్కదాన్నే పెద్దగా ఏడ్చేదాన్ని వాళ్ళందరూ నన్ను ఓదార్చేవారు. జైలు కెళ్ళాక ప్రతిరోజూ ఉదయం మాకు జాబ్ వుండేది. మా కామ్రేడ్స్ నిర్ణయించిన జాబ్ చాట్. ప్రొద్దున్నే 6 గం॥ ల నుండి 9 గం॥ల వరకు రాజకీయ తరగతులు సాయంత్రం పాటలు డ్యాన్సులు నేర్చుకోవడం చిత్రమేమిటంటే ఏ సాహిత్యం చదివితే జైల్లో వేస్తారో అదే సాహిత్యం జైల్లో చదువుకోవడానికి జైలర్‌లు మాకు సప్లయ్ చేసేవారు. అక్కడ లైబ్రరీలో ఈ సాహిత్యం వుంది. నాకు ఆశ్చర్యం కల్గింది. ఆ జైల్లో వుండగా గోర్కీ అమ్మ, మేరీటైలర్ జైలు జీవితం చదువుకున్నాను. ప్రతిరోజూ అనసూయమ్మగారు సహజ, వెంకాయమ్మగార్లు రాజకీయ తరగతులు చెప్పేవారు. కమ్యూనిస్టు పార్టీ పుట్టుక, చరిత్ర చైనా రష్యా విప్లవాలు - భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాల గురించి అప్పుడే తెల్సుకున్నాను. జైళ్ళు నిరంతర విద్యాకేంద్రాలని ఎవరో కామ్రేడ్స్ చెప్పిన మాట నిజమనిపించింది. నేనేంటి? నా జీవితం ఏంటి? నన్ను దిగులు పడనీయకుండా అనసూయమ్మ గారు, సంధ్యక్క, వెంకాయిమ్మలు ఒళ్ళో పడుకోబెట్టుకొని ముచ్చట్లు చెప్పేవారు. ఉద్యమాలు చేయవల్సిన అవసరం- అందులో స్త్రీల పాత్రఏమిటీ అనే విషయం నాకుతెల్సింది. నా చుట్టూ ఉన్న సమాజాన్ని పరిశీలించడం ప్రారంభించాను. అందుకు జైలుజీవితమే పునాది.

అదే కాంపెయిన్‌లో శ్రీశ్రీ, మహాప్రస్థానం, ఉదయతార, ఏడుతరాలు, మూడు తరాలు చదివాను. శ్రమజీవుల హృదయంలో,

(☛ తరువాయి 8వ పేజిలో ..... )

(➼ 7వ పేజీ తరువాయి ..... )

సేవ వేదనాగానంలో, పునీతమై తిరుగుతోందిరా ధరణీ చక్రం-ఈ శ్రమ జీవులు బానిస బ్రతుకులు బ్రతకడం జాలి కల్గించింది. శ్రమ జీవులు రాజ్యం రావాలి. ఒక మనిషికి మరొక మనిషికి ఒంగి సలాములు చేసి గులాములయ్యే రోజులు పోవాలి. ఆ కాంపయిన్‌లో "ఆపలేరు ఆపలేరు ఇంక మీరు ఆపలేరు ఈ మట్టిన తొలుచుకొని విప్లవాలు వస్తున్నాయ్ ఎరుపెక్కిన ఈ మట్టికి మానెత్తుటి లాల్‌సలామ్, భూస్వాముల కొట్టాలకు నిప్పులంటు కుంటున్నాయ్- మా ఊపిరితిత్తులతో ఊది ఊది మండిస్తాం' అనే చెరబండరాజు పాటను చాలా స్ఫూర్తితోపాడేదాన్ని. యువతరమా, నవతరమా ఇదే అదను కదలిరమ్మొ అనే పాట పాడేదాన్ని. బాగా పాడగలిగే ధైర్యం ఉన్నదాన్ని కావడంతో తోటి కామ్రేడ్స్, పేద ప్రజలు నన్నెంతో ఆప్యాయంగా చూసుకునేవారు. వాళ్ళ ఇళ్ళలో మంచి కూరలు వండిపెట్టేవారు. ఈ ఆదరణ చూశాక ఎప్పటికీ ఇలాగే బ్రతకాలనిపించింది. ప్రజలు మార్పును కోరుతున్నారు విప్లవాన్ని ఆహ్వానిస్తున్నారు. అందుకే మాకింత ఆదరణ. అది సెప్టెంబరు 1985 ఛలోచీరాల కారంచేడుసంఘటనపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు వచ్చారు. ఆరోజు వేదికపై నేను పాడిన పాటలు. లక్షలాది మంది విన్నారు. అప్పుడే ఎంతోమంది ప్రముఖుల దృష్టిలో పడ్డాను. ఆ సభ అనంతరం ఎంతో మంది అన్నలు, అక్కలు, అమ్మలు, తమ్ములు దగ్గరయ్యారు- కత్తి పద్మారావులాంటి ఆత్మీయమైన అన్నయ్యను సంపాదించుకున్నాను. మాష్టార్జీలాంటి గురువును పొందాను. ఆ సభలో పాటలు పాడటం వల్ల లక్షలాది మంది హృదయాలకు దగ్గరయ్యాను. ఆ సభలోని వక్తల మాటలు నాకు ఉద్యమస్ఫూర్తి నిచ్చాయి -ఉద్యమాల పట్ల గొప్ప గౌరవాన్ని కలిగించాయి.

టంగుటూరులో పొగాకు రైతులుకు న్యాయం జరగాలంటూ దళిత ఇందిరను రేప్ చేసి చంపిన కుందేటి సత్యంను శిక్షించాలని తునికాకు కూలీల రేట్లు పెరగాలని, సారా నిషేధించాలని చేసిన కాంపెయిన్‌లలో నేను పాటలు పాడేదాన్ని నాటికలు వేసేదాన్ని వాటిల్లో తొలిపొద్దు, ఇడియట్, ఎన్‌కౌంటర్ అనే కళ్యాణరావు గారి నాటికలు నన్నెంతో ఆకర్షించాయి. ఎన్నికల బహిష్కరణ కాంపెయిన్, సమ్మర్ కాంపెయిన్లలో నేనెంతో నేర్చుకున్నాను. ఒక్కసారి తిని, తినక ఒట్టి కడుపుతో పడుకోవాల్సి వచ్చేది. అయినా తోటి కామ్రేడ్స్‌తో మాట్లాడుతూ పాటలు పాడుతూ కాలం గడిచేది. తునికాకు కూలిరేట్లు పెరిగినయ్, సారా నిషేధించారు. అప్పుడు పెద్ద విజయం సాధించినట్లు నాలో సంతృప్తి. ప్రజా ఉద్యమాల్లో సాధించలేనిది లేదు అని స్పష్టంగా అర్థం అయ్యింది. త్యాగం తల్లి ప్రేమ కన్నా గొప్పది. తన జీవితంపట్ల తనకు మక్కువ వుంటుంది. కానీ సమాజం కోసం జీవితాల్ని తృణప్రాయంగా పణంగా పెట్టటాన్ని ప్రజాఉద్యమం మనకు నేర్పుతుంది. మొండి ధైర్యాన్ని తెచ్చిపెడుతుంది. ఎంతగా వాళ్ళలో వుండాలనిపించినా నా ఒక్క శరీరం దళంలో ఉండనీయకుండా చేసింది.

నేనెంతో అదృష్టవంతురాలిని. నేను డెలివరీ అయినపుడు రీజినల్ కమిటీ సెక్రటరీ విజయకుమార్ భార్య రాములమ్మ నాకు సేవలు చేసింది. ఆరునెల్లునాతో గడిపింది. కొన్ని కుటుంబాల వద్దకు తీసుకెళ్ళి చిన్న చిన్న మీటింగులుపెట్టి నాతో పాటలు పాడించేది. మహిళలు ఉద్యమాల్లో భాగస్వాములవడానికి వారి చుట్టున్న పరిస్థితుల్ని అంచనా వేసుకోవడానికి తగిన సూచనలన్ని వాళ్ళతో అక్క మాట్లాడేది. నాచేత పంచాది నిర్మల పాట, కర్మభూమిలో పాటలు పాడించేది. నాకు అక్క అంటే ఎంతో ఇష్టం వుండేది. ఆమె ఆర్నెల్లు నాతో వుండి వెళ్ళిపోయింది. ఆ తర్వాత సంవత్సారానికి తెల్సింది ఆ అక్కను పోలీసులు పట్టుకొని మాయం చేశారని. మహిళల్ని పట్టుకెళ్ళి మాయం చేయడం మొట్ట మొదట స్వర్ణక్క తర్వాత రాములక్క. ఎ.ఎన్.ఎం. ఉద్యోగానికి రాజీనామా చేసి ఉద్యమాల్లోకి వచ్చి అక్క అలా చనిపోయిందంటే ఆమె ఎంత త్యాగమూర్తి! ఉద్యమాలకు అలాంటి త్యాగాలు అనివార్యం అని తెల్సుకున్నాను. వీళ్ళంతా ఎవరు? ఎక్కడి వాళ్ళు! సమాజాన్ని ఎంతగా ప్రేమిస్తే వాళ్ళు ఆ త్యాగాలకు సిద్ధపడ్డారు! కుటుంబ కలహాలవల్లనో, ఆ ఉద్యమం నాకు సంతృప్తి నివ్వక పోవడం వల్లనో 1985 నుండి 1993 వరకు పనిచేసిన ఉద్యమ జీవితానికి స్వస్తిపలికాను. 9 సంవత్సరాల ఉద్యమ జీవితం తర్వాత మామూలు సమాజంలో నా జీవితం స్వార్థపరమైనదిగా తోచింది. ఒకశక్తి లాగా వున్న దాన్ని వ్యక్తిగా మిగిలిపోవడం అవమానకరమే. నన్ను నేను ఒక పనికిమాలిన దాన్నిగా ఎంచుకున్నాను. 1996లో కవి సత్యమూర్తిగారితో పరిచయం ఏర్పడింది. బహు జన రిపబ్లికన్ పార్టీకి ఏకలవ్య కళామండలి రాష్ట్ర కన్వీనర్‌గా పనిచేశాను. దళితులకేనా ఉరిశిక్ష? కారంచేడు హంతకులెక్కడ? అంటూ చలపతి విజయవర్ధనం ఉరిశిక్ష రద్దు కోసం జరిగిన ఉద్యమంలో గొంతెత్తి పాడాను. దళితుల ఐక్యత కోసం జరిగిన మీటింగుల్లో పాటలుపాడాను. పాటలు రాశాను. దళితుల రాజ్యాధికారం కోసం జరిగిన ఎన్నో సభలకు హజరయ్యాను. కారంచేడు ఒగ్గుకథ చెప్పాను. శివసాగర్ రాసిన 'నల్లసూరీడు' పాట పాడే అదృష్టం దక్కింది. ఆ పాటతో మళ్ళీ నాకు ప్రత్యేకమైన గుర్తింపు. నేను మళ్ళీ ప్రజల్లో ఉన్నాను. ఇప్పుడు అచ్చంగా నా కుటుంబంతో ఉన్నానన్న దగ్గరతనం. ఆనందం. నేను దళితను అన్న స్పృహ నాకు కల్గింది. దళిత ఉద్యమాలలో దళితులే ముఖ్యభూమికను పోషించడం నాకు నచ్చిన అంశం. నా సమస్య పరిష్కారానికి నేనే కొట్లాడాలి అన్న స్పృహతో దళితులు స్వచ్ఛంధంగా పాల్గొనడం అందులోనూ మహిళలు ఎక్కువ సంఖ్యలో ఈ ఉద్యమాల్లో పాల్గొనడం ఒక కొత్త మార్పుగా తోచింది. మాదిగ దండోరా ఉద్యమం, దళిత సాహిత్యం కొత్త స్ఫూర్తినిచ్చాయి. ఫూలే, అంబేద్కర్ జీవితాలు అస్థిత్వ, ఆత్మగౌరవ ఉద్యమాలు నాకెంతో నచ్చాయి.

(➼ తరువాయి 11వ పేజీలో ..... )

# దళిత స్త్రీలు - విద్య

...✍ - బి. నీరజ

**విద్య ఎందుకు?**

విద్య ప్రాథమిక హక్కు కావాలని వాదించేందుకు పబ్లిక్ రిపోర్ట్ అనే బేసిక్ ఎడ్యుకేషన్ (ప్రోబ్)

ఎనిమిది అంశాలను పేర్కొనటం జరిగింది అవి 1. రాజ్యాంగ హక్కు, 2. ప్రజల ఆకాంక్ష 3. అభివృద్ధి పెట్టుబడి 4. మధుర అనుభూతి, 5. వ్యక్తిగత స్వేచ్ఛ, 6. సామాజిక లాభాలు, 7. రాజకీయ భాగస్వామ్యం, 8.సామాజిక న్యాయం. పైఎనిమిది అంశాలను సాధించినపుడు మాత్రమే అది పరిపూర్ణ విద్యా హక్కుకు న్యాయం జరిగినట్టవుతుంది.

**సామాజిక మార్పుకు సాధనం విద్య**

ఒక వ్యక్తి జీవితంలోనూ, మొత్తం సమాజంలోను విద్య విలువైన సాధనం. ఆధునిక సమాజంలో అన్ని వ్యవహారాలు లిఖిత మాధ్యమంలో జరుగుతున్నప్పుడు అక్షరాస్యత కీలకమ వుతుంది. అడుగడుగునా వ్యక్తి తన ప్రయో జనాలను కాపాడుకునేందుకు అక్షరాస్యత, విద్య ఆయుధాలవుతాయి. అభివృద్ధి అనేది అయిదు రకాల స్వేచ్ఛకు దారితీయాలి. అవి అంతర్గత స్వేచ్ఛ, విధాన పరమైన స్వేచ్ఛ, భాగస్వామ్య స్వేచ్ఛ, వినిమయ స్వేచ్ఛ, రక్షిత స్వేచ్ఛగా అమర్త్యసేన్ భావించారు. అంతర్గత స్వేచ్ఛంటే సహేతుకంగా ఆలోచించటం, సృజనాత్మకంగా భావ వ్యక్తీకరణ చేయటం, ఇది విద్యవల్లే సాధ్యం. వ్యక్తిగత జీవితంలో, కోర్టులో తననుతాను సమర్థించుకోగలగాలన్నా, బ్యాంకు రుణాలు తీసుకోవాలన్నా, అభివృద్ధి సంక్షేమ పథకాల పట్ల అవగాహన ఏర్పరచుకుని వాటిని ఉపయోగించాలన్నా, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోగలగాలన్నా, రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచుకో గలగాలన్నా, తన పౌరసత్వ హక్కులను తెలుసుకోవాలన్నా, చివరికి ఏబస్సు ఎక్కాలో అర్థం కావాలన్నా, సరైన ఉపాధిని పొందాలన్నా అక్షరాస్యత, విద్య అనివార్య సాధనాలవుతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఆధునిక ఆర్థిక వ్యవస్థలో, సమాజంలో మనుగడ సాధించాలన్నా, అభివృద్ధి కావాలన్నా విద్య కీలకమైనది అవసరమైనది.

వ్యక్తి జీవితంలోనే కాదు సామాజిక మార్పుకు కూడా విద్య కీలకం. ఎందుకంటే విద్యారంగంలో అభివృద్ధిని సాధించటం ద్వారా సామాజిక లక్ష్యాలను, అభివృద్ధిని సాధించగలం. అంతేకాకుండా సమాజంలో సాంప్రదాయకంగా ఉన్న కుల, మత, లింగపరమైన అనేక అసమానతలను, మూఢనమ్మకాలను, దోపిడీని, హింసను అధిగమించేందుకు విద్య ఆయుధమవుతుంది. సామాజిక అసమానతలు విద్యాపరమైన అభివృద్ధి ద్వారా తొలగించటం సులభమవుతుంది. సామాజిక అసమానతలు ఇన్ని విధాలుగా వ్యక్తి జీవితాన్ని ప్రభావితం చేస్తున్న విద్య అన్ని వర్గాల వారికీ సమానంగా అందుతుందా? అందులో బలహీనవర్గాలకు ప్రత్యేకించి దళిత బాలికలకి, స్త్రీలకి ఏ మేరకు అందుతుంది?

ఆంధ్రప్రదేశ్‌లో ప్రాథమిక విద్య- అభివృద్ధి, ఆటంకాలు - సమాజంలోని అతిప్రధానమైన సూచికల్లో విద్య ఒకటి. స్థూల జాతీయోత్పత్తి స్థాయి అక్షరాస్యత లేదా విద్యపై నేరుగా ప్రభావాన్ని చూపుతుంది. దారిద్ర్యం, జనాభా పెరుగుదల, ఆరోగ్యం, నేరాల రేటు పరోక్షంగా ప్రభావాన్ని చూపుతాయి. విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉన్నప్పటికీ మన విధాన నిర్ణేతలు తగినంత ప్రాధాన్యత నివ్వటం లేదు. జాతీయస్థాయిలో విద్యారంగానికి చాలాతక్కువ కేటాయింపులు జరుగుతున్నాయి. మొత్తం కేటాయింపుల్లో 75 శాతం ప్రాథమిక విద్యకు లభించాల్సి ఉండగా 50 శాతం కన్నా తక్కువే దీనికి చేరుతుంది. అంతేకాకుండా అభివృద్ధి స్థాయిలో మద్య స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాల పరిస్థితి అధ్వానంగా ఉంది. 2001 జనాభా లెక్కల ప్రకారం వయోజన విద్యలో మొత్తం 28 రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ 22వ స్థానంలో ఉంది. తలసరి స్థూల ఉత్పత్తిలో 11వ స్థానంలో ఉంది. గత నాలుగు దశాబ్దాలలో ఆంధ్రప్రదేశ్‌లో అక్షరాస్యతా శాతం మొత్తం దేశం స్థాయికంటే చాలా తక్కువగానే ఉందని మేధావుల నివేదికలు తెలియపరిచాయి. గత దశాబ్దంలో (2001) ఈ రెండింటి మధ్యవ్యత్యాసం అధికంగా ఉంది. 1990లలో ఆంధ్రప్రదేశ్‌లో మహిళల అక్షరాస్యత ఆలిండియా రేటు కన్నా అధిక రేటుతో పెరిగింది.

| అక్షరాస్యతాశాతం | భారతదేశం | | | ఆంధ్రప్రదేశ్ | | |
|---|---|---|---|---|---|---|
| (ఆధారం) | మొత్తం | పురుష | మహిళ | మొత్తం | పురుష | మహిళ |
| 1971(సెన్సస్) | 34 | 46 | 22 | 25 | 33 | 16 |
| 1981(సెన్సస్) | 44 | 57 | 30 | 36 | 48 | 25 |
| 1991(సెన్సస్ | 52 | 64 | 39 | 44 | 55 | 33 |
| 1994(ఎన్ఎస్ఇఆర్) | 54 | 66 | 40 | 50 | 61 | 39 |
| 1997(ఎన్ఎస్ఎస్ఒ) | 62 | 73 | 50 | 54 | 64 | 43 |
| 2001(సెన్సెస్) | 65 | 76 | 54 | 61 | 71 | 51 |

షెడ్యూల్డు కులాల, తెగల జనాభాలో అక్షరాస్యతా శాతం ఆంధ్రప్రదేశ్ కన్నా దేశం మొత్తం మీద ఎక్కువగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతాలలో సామాజిక అంతరాలు ఎంత అధికంగా ఉన్నాయనేది తెలుసుకోవడానికి ఇదిఒక సూచిక.ఇందులో మహిళా అక్షరాస్యతా శాతం దాదాపు 10శాతం మాత్రమే. అంటే ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి వెయ్యి కుటుంబాలలో మహిళలు అక్షరాస్యులు కాని కుటుంబాలు 731 ఉన్నాయి. అసలు అక్షరాస్యులు లేని కుటుంబాలు 465 ఉన్నాయి. దేశం మొత్తం మీద మహిళా నిరక్షరాస్యుల కుటుంబాలు 633, పూర్తి నిరక్షరాస్య కుటుంబాలు 331 ఉన్నాయి. ఆర్థిక పరిస్థితిలో ఆంధ్రప్రదేశ్ స్థానం అక్షరాస్యత స్థానంలో ప్రతిబింబించటం లేదని అర్థమవుతుంది. 2001 నాటికి ప్రాథమికవిద్య విషయంలో ఆంధ్రప్రదేశ్ మొత్తం 35రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో

28వ స్థానంలో ఉంది. 2001 నాటికి స్వల్ప అక్షరాస్యత కలిగిన రాష్ట్రాల్లో ఆశించినంత ముందులేదని స్పష్టమవుతుంది.

అఖిల భారత విద్యాసర్వేలు ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత ప్రాథమిక పాఠశాలలు ఏ మేరకు అందుబాటులో ఉన్నాయన్న విషయాన్ని పరిశీలించింది. ఈ సర్వే ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న గ్రామాలలో 93 శాతం నివసించే 70 శాతం నివాస ప్రాంతాలకు ప్రాథమిక పాఠశాలలు అందుబాటులో ఉన్నాయని ఆరవ అఖిల భారత విద్యా సర్వే (1993) తెలిపింది. వీరిలో నడిచి వెళ్ళగలిగినంత దూరంలో స్కూళ్ళు కలిగిన జనాభా 98 శాతం. ఈరకమైన నివాసాలు 89శాతం అయితే 82శాతం షెడ్యూల్డు తెగల జనాభాకు, 97శాతం షెడ్యూల్డు కులాల జనాభాకు 3 కి.మీ. పరిధిలో పాఠశాలలున్నాయి. కొన్ని కొన్ని గ్రామాలలో పాఠశాలలు లేక పక్క ఊరికి పోయే పరిస్థితి ఉంది. స్కూళ్ళ అందుబాటులో ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించేందుకు, అక్షరాస్యత స్థాయిని పెంచేందుకు అనియత విద్యా కేంద్రాలను ఏర్పాటు చేశారు. బడిలో చేరని పిల్లలను, మధ్యలో బడి మానివేసే పిల్లలను ఈ కేంద్రాలలో చేర్చుకుని ఆ తర్వాత సాధారణ స్కూళ్ళలో చేరేలా చేయటం ఈ అనియత కేంద్రాల లక్ష్యం. అయితే రాష్ట్రంలో 1996-97లో 31,245 అనియత విద్యాకేంద్రాలలో 6.38 లక్షల పిల్లలు ఉన్నారు. అయినప్ప టికీ వీరి సంఖ్య స్కూళ్ళకు దూరంగా ఉన్న మొత్తం పిల్లల సంఖ్యలో 23.9 శాతం మాత్రమే. ఇవికాక గ్రామీణ ప్రాంతాలలో పేదరికం కారణంగా బడికిపోలేని పిల్లల కోసం మధ్యాహ్నభోజన పథకాన్ని ప్రవేశపెట్టారు. అయినప్పటికీ బడిమానివేసే పిల్లల సంఖ్య ఆశించినంతగా తగ్గలేదు. చాలా ఒడిదొడుకులు, అవినీతి, అంటరానితం, వివక్షతో మొదలైన మధ్యాహ్న భోజనం చాలా చోట్ల మధ్యలోనే ఆగిపోయింది. ఈ పరిస్థితుల్లో బలహీనవర్గాలకు చెందిన ప్రత్యేకించి దళితులకు చెందిన పిల్లల్లో ఏ మేరకు ప్రాథమిక విద్యను అందుకుంటున్నారు? విద్యా హక్కు మానవుని సగౌరవ జీవన హక్కులో ప్రధానమైన భాగమని ఆర్టికల్ 26, యూనివర్సల్ డిక్లరేషన్ ఆన్ హ్యూమన్ రైట్స్ 1948 లో ప్రకటించింది. పౌర, రాజకీయ, హక్కుల అంతర్జాతీయ కన్వెన్షన్, ఆర్టికల్13, ఆర్థిక సాంస్కృతిక హక్కుల అంతర్జాతీయ కన్వెన్షన్ ఆర్టికల్28, అంతర్జాతీయ బాలల హక్కుల సదస్సు ఈ హక్కును గుర్తించాయి. అన్ని దేశాల ప్రభుత్వాలు పిల్లలకు ఉచిత విద్యా హక్కును గుర్తించి, విద్య నేర్చుకునే అవకాశాలు కల్పించాలని సూచించాయి. అలాగే ప్రజలందరికీ ఇతర విద్యావకాశాలతో పోల్చదగిన స్థాయిలో కులం, మతం, రంగు, ఆడ-మగ తేడా లేకుండా విద్యావకాశాలు కల్పించాలని 1986లో జాతీయ విద్యా విధానంలో ప్రభుత్వం పేర్కొనటం జరిగింది. ప్రభుత్వ నిధుల సహాయంతో, ప్రభుత్వం నిర్వహిస్తున్న సంస్థలలో ప్రతి వ్యక్తికి సమాన అవకాశాలు కోరే హక్కు ఆర్టికల్29 (2) ద్వారా భారత రాజ్యాంగం కల్పిస్తున్నది. అలాగే విద్యాసంస్థలలో కుల, మత, ప్రాంత, లింగ తదితర కారణాలపై నిరోధించే వీలు లేదని ఆర్టికల్ 15(1) చెప్తున్నది.

షెడ్యూల్డు కులాలు, తెగలకు వెనుకబడిన వారికి విద్యావకాశాలు అందించటంలో ప్రభుత్వం కృషి చేయాలని ఆర్టికల్ 15 (4) నిర్దేశిస్తుంది. ఆర్టికల్15(4) షెడ్యూల్డు కులాలు, తెగలకు అదనపు హక్కు కల్పించింది. 86వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా పిల్లలందరికీ ప్రాథమిక విద్యా హక్కు ఉందని పార్ల మెంటు కొత్త రాజ్యాంగ నియమాన్ని చేర్చింది. పార్ట్-3 ప్రాథమిక హక్కుల విభాగం ఆర్టికల్ 21 (జీవన స్వేచ్ఛా హక్కు) తరువాత ఆర్టికల్2(ఎ)ను చేర్చారు. విద్యాహక్కు 6-14 సంవత్సరాల వయసు పిల్లలందరికీ, చట్టం ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఉచిత, నిర్బంధవిద్యను రాజ్యం నేర్పాలి. రాజ్యాంగ సమీక్షా సంఘం 2001 లో ఈ విద్యా హక్కు కల్పించాలని సిఫార్సు చేసింది.

అంతర్జాతీయ ఒప్పందాలు, రాజ్యాంగ నియమాలు, రాజ్యాంగ సవరణలు, ఎన్ని ఉన్నప్పటికీ విద్యాహక్కు అమలు కావటం లేదు. నిర్బంధ ప్రాథమిక విద్య, నిరక్షరాస్యత నిర్మూలన, బాలకార్మికవ్యవస్థ నిర్మూలన, మధ్యాహ్న భోజన పథకం, అందరికీ విద్య మొదలైనవి ఎన్ని చేపట్టినా దళిత బలహీనవర్గాల పిల్లలు వీటన్నిటిలో నిర్లక్ష్యం చేయబడుతున్నారు. కాగా మిగిలిన వారిలో ఎంత మంది విద్యను హక్కుగా పొందుతున్నారు?

**మహిళల విద్యను అడ్డుకుంటున్న సామాజిక అంశాలు :**

స్త్రీలు చదువుకుంటే సామాజికవ్యవస్థకు ప్రమాదమని సనాతన సాంప్రదాయవాదులు భావించేవారు. అయినప్పటికీ భారతదేశంలో విద్యావంతులైన స్త్రీలు ఎందరో ఉన్నారు 20వ శతాబ్దంలో ముఖ్యంగా స్వాతంత్ర్యానంతరం మ హిళల్లో అక్షరాస్యత పెరగటం సంతోషించదగ్గ పరిణామమే. అయితే ప్రపంచంలోని అనేక దేశాలతో, ప్రాంతాలతో పోలిస్తే భారత దేశం స్త్రీవిద్యలో వెనుకబడి ఉందన్నది కఠినమైన వాస్తవం. ఉదాహరణకు సబ్ సహరన్ ఆఫ్రికాలో సైతం స్త్రీ అక్షరాస్యత భారతదేశం కన్నా ఎక్కువగా ఉంది. 1991 లో భారతదేశంలో 15-19 సంవత్సరాల వయసున్న బాలికలలో సగం మంది నిరక్షరాస్యులు. అందుకు అనేక సామాజిక కారణాలున్నాయి.

మన దేశంలో గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ పాఠశాలలు లేకపోవటం వల్ల ఎక్కువ బాలికలే నష్టపోతున్నారు. అది కూడా దళిత, బలహీనవర్గాల వారే ఎక్కువగా నష్టపోతున్నారు. అందులోనూ ఆ దళిత ఆడపిల్లలే మరింతగా నష్టపోతున్నారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల లేకపోయినా, మూతపడినా, సరిగా పనిచేయకపోయినా తల్లిదండ్రులు మగపిల్లలనైతే పక్క ఊరికి పంపుతారు. లేదా ప్రైవేటు స్కూలులోనైనా చేరుస్తారు. కాని ఆడపిల్లనైతే అందరు తల్లిదండ్రులు పక్క ఊరికి పంపించేందుకు ఇష్టపడరు.దళిత కుటుంబాల్లో పంపాలని ఉన్నా ఫీజులు చెల్లించి ప్రైవేటు స్కూలుకు పంపటానికి భారంగా భావిస్తారు. అంతేకాక స్త్రీ పురుష సంబంధాలు స్త్రీలకు ప్రతికూలంగా ఉండడం వల్ల కూడా స్త్రీల అక్షరాస్యత, విద్య దెబ్బతింటున్నాయి. తల్లిదండ్రులు కూడా బాలికలకన్నా బాలల చదువుపైనే ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారు. దీనికి స్త్రీ పురుషుల పని విభజన, స్త్రీ అంటే పిల్లలను కనిపెంచటం మాత్రమే అనే భావన, స్త్రీలు ఇంటిపని చేసుకోవడం మాత్రమే అని అనుకోవడం కారణంగా స్త్రీల విద్యాభివృద్ధి జరగటం లేదు. మన సమాజంలో స్త్రీలు వివాహమయ్యాక పురుషుల ఇంటికి వెళ్తారు కాబట్టి ఎంత చదివినా ఇతరుల ఇంటికి ఆదాయాన్ని తెచ్చిపెడతారన్న భావన, అంతేకాక పురుషాధిక్య సమాజపు విలువలు బలంగా ఉన్న మనసమాజంలో భార్యకన్నా భర్త ఎక్కువ విద్యావంతుడై ఉండాలి. లేదంటే పురుషాభిమానం అడ్డు వస్తుంది. చదువుకున్న అమ్మాయి భర్త మీద తిరగబడుతుందన్న భావన, ఉండటం వల్ల

తక్కువ చదువుకున్న స్త్రీని మాత్రమే పురుషుడు ఎంచుకుంటాడు కాబట్టి బాలికల చదువును నిరుత్సాహపరుస్తున్నారు. వరకట్న సమస్య వల్ల కుడా స్త్రీవిద్య కొనసాగటం లేదు. చదువుకోసం ఖర్చుచేయాలి. తరువాత పెళ్లికి వరకట్నం ఇవ్వాలి కాబట్టి ఇది రెండురకాల భారంగా తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఇక దళితుల్లో అయితే కూలి పని చేసుకుని జీవించే కుటుంబాలలో బాలికలు ఇంటిపని వంటపని చూసుకోవాలి. తనకంటే చిన్నవారు తమ్ముడు గాని, చెల్లిగాని ఉంటే వారిని చూసుకోవటానికి ఇంటివద్దనే ఉండిపోవాలి అదీకాక ప్రాథమిక స్థాయి వరకు ఎలాగోలా నెట్టుకు రాగలిగిన దళిత బాలికలు కుటుంబ ఆర్థికపరిస్థితులు కారణంగా మగపిల్లవాడినే చదివించటం జరుగుతుంది. అతికష్టం మీద మరికొన్ని కుటుంబాలలో ఇంటర్ వరకూ చదివినా ఉన్నత విద్యను చదివించలేని పరిస్థితులుండటం కొడుకు, కూతురు ఇద్దర్నీ ఉన్నత విద్యకు పంపాల్సి వచ్చినపుడు కొడుకునే పంపించటం జరుగుతుంది. ఈ కారణంగా దళిత బలహీన వర్గాల ఆడపిల్లల్ని ఉన్నత విద్యకు పంపాల్సివచ్చినపుడు కొడుకునే పంపించటం జరుగుతుంది. దళితబలహీనవర్గాల ఆడపిల్లలు ఉన్నత విద్యలో వెనుకబడిపోతున్నారు. బలహీనవర్గాల సంక్షేమం, స్త్రీ విద్యను లక్ష్యంగా ప్రకటించుకుంటున్న ప్రభుత్వాలు దళిత బాలికల, స్త్రీల విద్యకు ఏ మేరకు సహకరించాయి అనేది ప్రశ్నార్థకంగానే ఆకాశంలో ఉన్నత విద్య అందుకోలేకపోతున్న దళితులు : మనదేశంలో గత కొంతకాలంగా ఉన్నత విద్యలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. గడచిన పదేళ్ళకాలంలో ఉన్నతవిద్య మునుపెన్నడు లేనివిధంగా వ్యాపించింది. ప్రంచీకరణ మూలంగా ప్రైవేటు కళాశాలల సంఖ్య పెరుగుతుంది. కళాశాలల యాజమాన్యాలు ఫీజులను పెంచుతూ సీట్లతో వ్యాపారాలు చేస్తున్నాయి. ఫలితంగా బలహీన వర్గాలు ముఖ్యంగా దళితులు చదువుకొనలేక వెనుకబడి పోతున్నారు. సమాజంలో అన్ని వర్గాల విద్యార్థులకు అందాల్సిన ఇంటర్మీడియెట్ విద్య రెండు భాగాలై పోయింది. దళిత బలహీన వర్గాల పిల్లలంతా ప్రభుత్వ కళాశాలలకు వెళ్తున్నారు. కొద్దో గొప్పో అప్పు చేయగలిగే స్థోమత ఉన్నవారి పిల్లలు కార్పొరేట్ కళాశాలలకు వెళ్తున్నారు. ఇక ఉన్నత విద్యలోనూ ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణల విధానాలే అమలు జరుగుతున్నాయి. ఫలితంగా విశ్వవిద్యాలయాల్లో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల రూపంలో వ్యాపారం మొదలైంది.

2001 నివేదికల ప్రకారం నిరక్షరాస్యులో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందినవారే ఎక్కువ ఉన్నారని, ఎస్సీల్లో 54 శాతం మాత్రమే అక్షరాస్యులున్నారని మేధావుల నివేదికలు తెలుపుతున్నాయి. దళిత బాలికల విద్య, గత పదేళ్ళ కాలంలో ప్రవేశపెట్టిన సంస్కరణలు, విధానాల వల్ల దళిత విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యారు. గడచిన విద్యా సంవత్సరం (2003-04) లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విడుదల చేయాల్సిన ఫీజు రీయంబర్స్ ఇప్పటివరకూ విడుదల చేయలేదు. ఫలితంగా దళితవర్గాలకు చెందిన విద్యార్థులు చదువుల్ని మధ్యలోనే మానుకోవాల్సి వస్తుంది. దళిత బాలికల విద్య, దళిత స్త్రీల ఉన్నత విద్య మరింత దయనీయంగా ఉంది.

తల్లి చదువుకంటే ఇల్లంతా చదువుకున్నట్టే అన్న విధంగా దళిత స్త్రీ చదువుకొని దళిత వర్గాలని విద్యావంతుల్ని చేసి తద్వారా దేశాన్ని ప్రగతిపథంలో పయనింప చేయగలగాలి. ●

( 9వ పేజీ తరువాయి ..... )

ఉద్యమాలకు స్ఫూర్తిని నా అణువణువునా నింపిన ప్రతీ ఉద్యమానికీ, కార్యకర్తలకూ నా జైభీమ్‌లు. మామూలు స్త్రీగా గాక స్వతంత్ర భావాలు కల్గిన స్త్రీగా, నా కోసమే కాక నాతోటి స్త్రీల బ్రతుకుల గురించి మార్పు కోరుకునే దానిగా నన్ను తీర్చిదిద్దిన ఉద్యమాల రుణం ఎన్నటికీ తీర్చుకోలేనిది.

1996 నుండి 2001 వరకు దళిత ఉద్యమాలలో పాల్గొన్నాను. ఒక తల్లికీ తండ్రికీ కూతుర్నే కాకుండా నేనెవరో తెల్సుకోవడానికి ఈ అనుభవం తోడ్పడింది. కాన్షీరాం నుంచి కత్తిపద్మారావు దాకా ఆ మాట కొస్తే కంచికచెర్ల కోటేశు నుంచి మారోజు వీరన్న దాకా దళితుల పోరాటాలు, వేదనలు అవమానాలు ప్రాణత్యాగాలు నాకు ఊపిరి సలపనివ్వలేదు. ఉద్యమం అంటే ప్రతిఘటించడం అంటే బతుకుని నాశనం చేసుకోవడం అనీ నెత్తురోడటం అనీ భరించరాని వేదననీ తెలిసొచ్చింది. బాధని మరిపించే, యిందులోనూ మనిషిగా నిలబడే అవకాశాన్ని కల్పించిందీ, ఆ నెత్తురుటేరుల ఉద్యమమే, అందరూ గర్వించదగిన గొప్పకవి కె.జి. సత్యమూర్తి, ఈ తరం వాగ్గేయకారుడు గోరటి వెంకన్న, ప్రజాకవి గద్దర్, వంగపండు ప్రసాదరావు, మాష్టార్జీ మిత్రులు కలేకూరి ప్రసాద్, మద్దూరి నగేష్ బాబు, నందిని సిద్ధారెడ్డి, మల్లేపల్లి లక్ష్మయ్య, పైడిశ్రీ, కృపాకర్ లాంటి కవుల్నీ రచయితల్నీ ఉద్యమం కోసం తపించేవాళ్ళనీ కలుసుకోగలిగాను.

ముఖ్యంగా దళిత మహిళలు ఎక్కువగా వచ్చే సభలకు తప్పకుండా హాజరయ్యాను. వాళ్ళ కాళ్లకి తెగిన చెప్పుల్నీ, చిరిగి పోయిన చీరల్ని చూసి బాధపడ్డాను. చిన్న ఆశతో లారీలెక్కి వచ్చే ఆడవాళ్ళు, నీళ్ళకోసం, పులిహోర పొట్లాలకోసం పడేతపనని చూసి తల్లడిల్లిపోయాను. వీళ్ళంతా నా వాళ్ళు. అంబేడ్కర్ వేదనంతా వీళ్ళకోసమే నాలాంటి వాళ్ళ కోసమే. నా బతుకుదెరువు నాచిన్న ఉద్యోగం. వీటితో సతమత మౌతూనే ఈ జనం నా జనం వీరికోసం ఏ కొంచెమైనా చేయగలగాలి. ఏం చేయగలను? పాడటం తప్ప ఏమి చేతకాదు. కానీ పాట పది మందికి నచ్చుతుంది. నన్ను ప్రజా ఉద్యమాల పాటలు ప్రభావితం చేసినట్టే నా పాటలూ పదిమందిని ఉత్తేజపరచగలిగితే అదేచాలు! వ్యక్తిగా, అరకొరగా, అస్తవ్యస్తంగా ఏమి చేయడం సాధ్యం కాదు. ఎంత చిన్నదైనా ఒక వేదిక ఉండాలి. కలసి పాడటం, కలసి పనిచేయడం, ఉద్యమించడంలో ఉన్న తృప్తీ, ఆనందం మరెందు లోనూ వుంటాయని అనుకోను.

అందుకే 'దళిత్ విమెన్ థియేటర్' అనే చిన్న సంస్థని ప్రారంభించే ఆలోచనతో వున్నాను. మిత్రులందరికీ చెప్పాను. ఇది మంచి ఐడియా, ఆచరణలో పెట్టమన్నారు. దళిత స్త్రీలతో, దళిత స్త్రీల కోసం, దళిత స్త్రీల తరపున గొంతు విప్పే సాంస్కృతిక కళామండలి ఇది. దీన్ని బాగా చేయగలిగితే నాడు స్ఫూర్తినిచ్చిన విప్లవోద్యమానికి నేడు బతుక్కో అర్థం చెప్పిన దళిత ఉద్యమానికి నా నెత్తుటి రుణాన్ని తీర్చుకున్నట్టే...... ●

# ఒంటరి యుద్ధనౌక రమాబాయి అంబేడ్కర్

...✍ - జి.వి. రత్నాకర్



మహారాష్ట్రలోని పీష్వాల సామ్రాజ్యం అది. ఆ కాలంలో అంటరాని తనం కారణంగా దళితులపై అనేక రకాల అత్యాచారాలు జరుగుతుండేవి. అప్పటి సంఘటనలు - దుర్మార్గమైన అత్యాచారాలు వింటే రాళ్ళు కూడా కరిగి పోతాయి. కానీ ఆకాలపు రాజులు. అగ్రవర్ణాల సాంప్రదాయపు మూర్ఖుల మనసులు మాత్రం రాళ్ళ కంటే కఠినంగా ఉండేవి. మనిషి మనిషికి మధ్యనున్న దూరాలు పెంచే వారి ప్రయత్నాలు నిర్విరామంగా సాగుతుండేవి. ఈ నేల మీద పుట్టిన ప్రతిమనిషికీ అందరిలా బ్రతికేందుకు జీవన హక్కు ఉంది. కానీ ఆ మాటని అప్పటి పాలకులు ఒప్పుకునేవారు కాదు. అలాంటి గాఢాంధకారపు చీకటి రాత్రి నుండి, కొండల బండల్ని తొలుచుకొని ఉత్తుంగ తరంగాలతో కూడిన ఓ సూర్యుడు 'మో' మట్టి నుండి ఉదయించాడు. సమత, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వపు దారిలోకి దళిత రథాన్ని మళ్ళించి అంటరాని బ్రతుకులకి ఒక అర్థం కల్పించాడు. కోట్లాది అంటరాని వెనుకబడిన వర్గాలకి ఆత్మగౌరవ కిరణాల వెలుతుర్ని ప్రసాదించాడు. ఆ మహామనీషి పేరే డా. బాబాసాహెబ్ అంబేడ్కర్.

బాబాసాహెబ్ జీవితం అనేక కష్టాలతో ముళ్ళ బాటలో నడిచింది. అది పూర్తిగా అగ్రవర్ణపు ఆధిపత్య భావజాలపు అన్యాయాలకి, అత్యాచారాలకి బలయింది. ఆ అవమానపు అగ్నిని ఆయుధంగా బాబాసాహెబ్ మలుచుకొన్నాడు. ఆ అవమానాల అత్యాచారాల నుండి దళితులకి విముక్తి మార్గాన్ని ప్రసాదించాడు. ఆ నిర్విరామ సంకల్పానికి కొండంత అండగా, వెన్నంటి నీడగా నిలిచింది ఆయన భార్య రమాబాయి. రమాబాయిని బాబాసాహెబ్ 'రామూ' అని ఆప్యాయంగా పిలుచుకునేవాడు.

మహారాష్ట్రలోని కొంకణ ప్రాంతంలో నిరుపేద తల్లిదండ్రులకు రమాబాయి జన్మించింది. ఆమె జన్మించిన గ్రామం పేరు "వణంద్". అక్కడ పొలాల్లో కూలి పనులు చేసుకునే భీకూ-ధోత్రే మరియు అతని భార్య రఖమాలకు పుట్టిన మరుక్షణం నుండే రమాబాయి జీవితంలో కష్టాలు ఆరంభమయ్యాయి.

రమాబాయికి ఐదారు సం॥ల వయసప్పుడు వాళ్ళ తండ్రి జమీందారు పొలంలో పనిచేస్తూ అంతుచిక్కని రోగంతో చనిపోయాడు. ఆ దుఃఖాన్నుండి కోలుకోలేకపోయిన ఆమె తల్లి రఖమా కూడా కొద్ది రోజుల్లోనే చనిపోయింది. తల్లిదండ్రుల నీడలో బ్రతకాల్సిన ఆమె బాల్యానికి ఆ సంఘటనలు శరాఘాతాలైనాయి. తమ్ముళ్ళ, చెల్లెల్ల బరువు బాధ్యతలు ఆరు సంవత్సరాల ఆ చిన్నారి రమా యొక్క లేలేత భుజాలపై పడ్డాయి. ఆ కాలంలో ముంబాయిలో ఉంటున్న రమా మామ గ్రామానికొచ్చి 'రమా'ని ఆ పసిపిల్లల్ని ముంబయి తీసుకెళ్ళాడు. గ్రామంలో ఉంటూ రమా పిడకల్ని అమ్ముతూ చెల్లెల్లని, తమ్ములని పోషించేది. ముంబాయి వచ్చిన తర్వాత కూడా రమాకి ఆ పని నుండి విముక్తి దొరకలేదు. మామ ఇంట్లో ఉన్నా కూడా రమా రేయింబవళ్లు కష్టించి పనిచేసేది. ఆమె వివాహం 13 సం॥ల వయస్సులో బాబాసాహెబ్ తో 'భాయ్‌ఖలా'లోని చేపల మార్కెట్‌లో జరిగింది. బాబాసాహెబ్ ఆ సమయంలో మెట్రిక్ ఉత్తీర్ణుడై ఉన్నాడు. అంటరాని వారి చరిత్రలోనే అదొక మహత్తరమైన ఘట్టం. బాబాసాహెబ్ తండ్రి అయిన రామ్‌జీ సుబేదార్‌కి బాబాసాహెబ్‌ని ఇంకా చదివించాలనే కోరిక ఉండేది. కానీ ఆయన ఆరోగ్యం క్షీణ దశలో ఉంది. కనుక ఆయన ఆ బాధ్యతని రమాబాయి భుజస్కందాలపై మోపి తనువు చాలించాడు.

రమాబాయి జీవితం సుఖదుఃఖాల ఆటుపోట్లతో కూడిన సముద్రం లాంటిది. అందుకని ఆమె జీవిత నౌక ఆ తీరాన కొట్టుకులాడుతుండేది. అయితే ఆ ధైర్యం గల తల్లి ఎప్పుడూ తన ధైర్యాన్ని వీడలేదు. ప్రతి సమస్య నుండీ పాఠాలు నేర్చుకుంటూ పోరాటం చేసింది. విద్యాభ్యాసం కోసం బాబాసాహెబ్ ఎప్పుడూ విదేశాలు పోతూ వస్తూ ఉండేవాడు. సంవత్సరాల తరబడి ఆయన విదేశాల్లో చదువుకుంటూ ఉంటే ఇక్కడ రమాబాయి సంసార నావని ఒంటరిగా నడుపుతుండేది. కడుపేదరికంతో మరియు ఏ ఆధారం లేకపోవడంతో చాలాసార్లు రమాబాయి తన పిల్లలతో ఆకలి కడుపుతోనే నిద్రపోయేది.

సకాలంలో వైద్యం అందక ఆమె పిల్లలు చనిపోవడం జరిగింది. కానీ ఆ విషయాలు ఏమీ రమాబాయి బాబాసాహెబ్‌కు చెప్పలేదు. ఎందుకంటే ఆ విషయాలు వింటే బాబాసాహెబ్ చలించిపోతారు, ఫలితంగా ఆయన ధైర్యం సన్నగిల్లిపోతుంది. బాబాసాహెబ్ విద్యాభ్యాసం సగంలోనే వదిలిరావడం రమాబాయికి ఇష్టం లేదు. కనుకనే ఆమె ఆ దుఃఖపు వెల్లువని ఒంటరిగానే తట్టుకొని, బాబాసాహెబ్ కన్న కలల్ని సఫలం చేయడంలో తన వంతు పాత్రని తాను నిర్వహించింది. మహావృక్షపు నీడలా రమాబాయి బాబాసాహెబ్ జీవితంలోకి ప్రవేశించింది. తను జీవించింది కొద్దికాలమే అయినా ఆమె ఆయన్ని వెన్నంటి నీడలా అనుసరించింది. భారతదేశ చరిత్రలో దళిత స్త్రీల త్యాగాల మహోజ్వల ఘట్టానికి ఆరంభ గీతం పాడింది. ●

# “పొలం పడావయింది” అంటున్న దళిత రైతు

**(జరిగిన అన్యాయానికి పోలీసులపై కేసేవేసి కోర్టు ఆర్డర్‌తో గన్‌మాన్‌ని తెచ్చుకొని “సాక్షి మానవహక్కుల నిఘా” పర్యవేక్షణలో న్యాయపోరాటం చేస్తున్న వ్యక్తి మల్లె రామయ్య)**

**1. మీపేరు, ఊరు, మీ కేసు వివరాలేమిటి?**

నా పేరు మల్లె రామయ్య. మానాయన పేరు జంగయ్య. మాది కొత్తపేట గ్రామము. కాశింపేట మండలము, మహబూబ్‌నగర్ జిల్లా నా వయస్సు 45సం॥రాలు. నేను ఎస్సీ మాదిగ కులానికి చెందినవాడిని. నా రెండో భార్య నన్ను వదిలిపెట్టి నా ఇంటి సొమ్ము తీసుకొని నా చేత భూమి రాయించుకొని వెళ్ళిందని న్యాయం చేయండని పోలీసుల్ని సాయం అడిగితే వాళ్ళే నన్ను హింసలు పెట్టడం జరిగింది.



మల్లె రామయ్య గన్‌మెన్

**2. ఆ విషయాలు తెల్పండి?**

నాకు పెళ్ళి అయినాక ఇద్దరు పిల్లలు పుట్టిన పదేళ్ళకి నా భార్య చనిపోయింది. నేను ఒక పదిహేనేళ్ళు అలాగే ఉండి నా పెద్ద కొడుక్కి పెళ్ళి చేసినాను ఒక బిడ్డ పుట్టినాక ఆనికి రోగమొచ్చి చనిపోయాడు. ఇంక ముసలి కాలాన చూసుకునే దిక్కు ఉండదని నేను ఆళ్ళు, ఈళ్ళు చెప్పిన మాటలిని ఇబ్రహీం పట్నం దగ్గర ఒక ఊరులో ఒక ఆమెని చూసి అయ్యగారు పెట్టిన మూర్తం ప్రకారం రామేశ్వరం దగ్గర పెళ్ళిచేసుకున్నాను. అప్పుడు నా వయస్సు 38 సం॥రాలు. నా భార్య యాదమ్మ వయస్సు 20సం॥రాలు ఉంటాయి. నాకు పెళ్ళి అయిన మూడేళ్ళకి ఒక కూతురు పుట్టింది. తర్వాత ఒక రోజు యాదమ్మకి పోలీసు సమన్లు వచ్చాయి. అవి ఏంటి అని తెలుసుకుంటే ఆమెకి ముందే పెళ్ళయిందని ఆ సమన్లు ఆమె భర్త పంపినవని తెలిసింది. తర్వాత ఒకరోజు ఏంది కత అని ఆమెని అడిగితే ఆమె నాతో గొడవ పెట్టుకుంది. ఒకరోజు పొద్దుగాలనే పొలం పోయి ఇంటికొచ్చి చూసేతలికి నా భార్య యాదమ్మ ఇంట్లో మూడువేల రూ॥లు పుస్తెల తాడు తీసుకొని నా రెండేళ్ళ కూతుర్ని ఇంట్లో వదిలిపెట్టి వెళ్ళిపోయింది. నేను ఇదేందిరా భగవంతుడా అనుకుంటా వాళ్ళకి, వీళ్ళకి చెప్పి కందుకూరు పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళాను. యాదమ్మ మొదటిభర్త ఊరు కందుకూరు పోలీసుస్టేషన్ ప్రాంతంలోనే ఉంది. అప్పుడు కందుకూరు ఎస్సై మా ఊరు కేశంపేట స్టేషన్ ప్రాంతంలో ఉంది కనుక ఆ ఎస్సై తనకు తెలుసునని నేను ఫోన్‌చేస్తాను అని నన్ను కేశంపేట ఎస్సైని కలవమని చెప్పాడు.

నేను కేశంపేట స్టేషన్‌కి వెళ్ళినపుడు అక్కడ ఎస్సైగా సాయి శ్రీనివాస్ ఉన్నాడు. ఎస్సై, కానిస్టేబుల్ బద్రినాయక్‌కి యాదమ్మని ఆమె మొదటి భర్త జంగయ్యని తీసుకురమ్మని చెప్పడం జరిగింది. బద్రినాయక్ వాళ్ళని తీసుకురాకుండా వచ్చి యాదమ్మ నాకు విడాకులు ఇస్తానని చెప్పిందన్నాడు. ఊరందరి ముందు పంచాయితీలో దేల్చి భూమిని రాయించి ఇస్తే యాదమ్మ వస్తానని చెప్పిందన్నాడు. అప్పుడు ఎస్సై నా చేత బలవంతంగా బాండు పేపరు తెప్పించి ఎకరన్నర భూమి రాయించి ఒరిజినల్ యాదమ్మకి ఇచ్చి జిరాక్స్ నాకిచ్చి తొందరగా రిజిస్ట్రేషన్ చేయించ మని తొందరపెట్టినాడు. ఈ పని కోసం నేను బద్రినాయక్‌కి 1000 ఇచ్చాను ఎస్సైకి 10వేలు ఇచ్చినాను. అయినా కూడా నా భార్య యాదమ్మ కాపురానికి రాలేదు. కారణమేందని నేను పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి వాళ్ళను అడిగాను. వాళ్ళు నన్ను బండబూతులు తిట్టారు. తర్వాత ఎస్సై సాయి శ్రీనివాస్ అయ్యప్ప మాల వేసుకున్నాడు. బాలరాజు, బద్రినాయక్‌లకు నేను కారు ఇచ్చి రోజుకి 200 రూ॥లు డీజిల్‌కి ఇచ్చేవాన్ని. పదిరోజులు పంపాను. వాళ్ళు ఎక్కడెక్కడో తిరిగి ఉత్తచేతులతో వచ్చారు.

కొన్నాళ్ళకి యాదమ్మ మొదటిభర్త అయిన ఉండేల జంగయ్యని జైలుకి పంపారు. యాదమ్మని మాత్రం తీసుకురాలేదు. నాకు జరిగిన అన్యాయాన్ని నేను పేపరోల్లకి చెప్పాను. అది జిల్లా అంతటా పేపర్లో వచ్చింది. కొన్నాల్లకి బద్రినాయక్ కొత్తపేట పంచాయితీకి వేరే కేసులో రావడం జరిగింది. నేనతన్ని పంచాయితీ దగ్గర నిలబెట్టి గట్టిగా అడిగాను. అతను నన్ను తిట్టాడు. నేను కూడా నువ్వేం చేసుకొంటావో చేసుకోపో అని తిట్టాను. తర్వాత రోజు రాత్రి నా పొలంలోని 2కింటాల నీళ్ళపైపుని అడ్డంగా నరికినారు. ఆ సంగతి సర్పంచికి చెప్తే ఆయన స్టేషన్‌కెల్లి కంప్లైంట్ ఇవ్వమన్నాడు. నేను కేశంపేట పోలీసుస్టేషన్ కెల్లి జరిగిన సంగతి చెప్పి నాకు బద్రినాయక్ మీద అనుమానం ఉందని చెప్పాను. తర్వాత ఎస్సై సాయి శ్రీనివాస్‌కి బదులు ఎస్సైగా రమాదేవి వచ్చింది నేను రమాదేవి ఎస్సై దగ్గరికి పోయి నాకు జరిగిన అన్యాయం గురించి చెప్పాను. అప్పుడు ఆమె “మాదిగ బుద్ధి చూపించుకున్నావురా మాపోలీసుల పైనే కంప్లైంట్ చేస్తావా కొడకా” అంటూ నానా బూతులు తిట్టింది. అప్పుడు అక్కడ సోమ్లా నాయక్ అనే కానిస్టేబుల్ కూడా ఉన్నాడు.తర్వాత నేను ఏడ్చుకుంటూ మా ఊరు పోయినాను. చనిపోవాలనుకున్నాను. మా పొలం బాయికాడ మర్రి చెట్టుకి ఉరిపోసుకుందామనుకున్నాను.

తర్వాత మనసు మార్చుకొన్నాను. చచ్చేదయినా వాళ్ళు అంతుచూసేటట్లు చావాలని అనుకున్నాను. తర్వాతి రోజు ఒక

(➡ తరువాయి 14వ పేజీలో ..... )

# నష్టపరిహారం పొందడమూ దళిత మానవహక్కే

## ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు తీర్పు

ఎస్సీ, ఎస్టీ అత్యాచారాలు నిరోధక చట్టం ప్రకారం బాధితులకు నష్టపరిహారం 3స్థాయిలలో అందుతుంది. 1. పోస్టుమార్టం, 2. చార్జ్‌షీట్ పెట్టడం, 3. తీర్పు అనంతరం. సాధారణంగా మొదటిస్థాయి వరకు వచ్చే నష్టపరిహారాన్ని మాత్రమే పర్యవేక్షిస్తుంటారు. కానీ **దళిత బహుజన శ్రామిక యూనియన్** మరియు **సాక్షి** ఈ కేసులో చివరిస్థాయి నష్టపరిహారం కూడా బాధితులకు అందేలా చేయడంలో విజయం సాధించి ఒక మార్గాన్ని ఆవిష్కరించి మానవహక్కుని పటిష్టపరచడం జరిగింది.

మహబూబ్‌నగర్ జిల్లాకి సంబంధించిన ఒక కేసు వివరాలిలా ఉన్నాయి.

మహబూబ్‌నగర్ జిల్లా తలకొండ పల్లి మండలం చంద్రధన గ్రామము పత్లావత్ తౌర్యా పూల్‌సింగ్ తండా నివాసి. 15.3.1999న అతను హత్యకు గురికాబడ్డాడు. ఈ కేసు క్రైం.నెం 13/99 302 ఐపిసి మరియు 3(2)(V) క్రింద నమోదు చేయబడి ప్రత్యేక సెషన్స్ జడ్జి మహబూబ్‌నగర్ వారు సెషన్స్ కేసు. నెం. 101/99 గా పరిగణించి 27.1.2005న తీర్పు ఇవ్వడం జరిగింది. ఈ తీర్పులో ముద్దాయిలు 1 నుండి 9వరకు దోషులుగా ప్రకటించి యావజ్జీవ శిక్షను ఖరారు చేసారు.

తీర్పు అనంతరం ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం 3వ స్థాయి నష్టపరిహారం 50,000 రూపాయలను మహబూబ్‌నగర్ కలెక్టర్ యం. జగదీశ్వర్ గారు లెటర్ నెం. C1 /3817/2005 తేదీ 4-1-2005 న మంజూరు చేసి 27-7-2005న బాధితుని భార్య పత్లావత్‌లక్ష్మి కి అందజేసినారు.

తలకొండపల్లి మండల కార్యదర్శి రమేష్ మరియు మహబూబ్‌నగర్ జిల్లా అత్యాచారాల కన్వీనర్ బోనాసి రామచందర్‌ల పటిష్ట పర్యవేక్షణల ఫలితంగా 3వ స్థాయి నష్టపరిహారం బాధితులకు అందడం జరిగింది. దీనిలో ***సాక్షి మానవహక్కుల నిఘా*** రాష్ట్రస్థాయి అధికారులకు సమాచారం అందించి ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం బాధితులకు రావలసిన నష్టపరిహారం కోసం వీరు కృషి చేశారు.

*(➜ 13వ పేజీ తరువాయి ..... )*

అప్లికేషన్ రాయించుకొని ఎమ్మార్వో ఆఫీసుకి పోతా 60 రూపాయలకి పురుగులమందు తీసుకొని పోయాను. ఎమ్మార్వోకి నా సమస్య చెప్పాను. ఆయన వినిపించుకోలేదు. నేను మందుడబ్బా తీసుకొని తాగాను. తర్వాత నాకేం తెలివిలేదు. 15 రోజులకి కళ్ళు తెరిసాను. మరుసటి రోజు నా కంప్లైంట్ తీసుకుని ఎస్పై నారాయణరెడ్డిని కలిసాను. మిగిలిన వాళ్ళందర్ని ట్రాన్స్‌ఫర్ చేశారని తెలిసింది. ఇంకా నా కంప్లైంట్‌ని ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ పున్నయ్య గారికిచ్చాను. ఎస్పీకి కూడా ఇచ్చాను. జులై 14, 2005 నాడు డిఎస్పీ ఆర్డర్‌తో నాకు కేశంపేట స్టేషన్ నుండి ఒక గన్‌మాన్‌ని ఇచ్చారు. అతని పేరు టి. అమర్‌నాథ్ (పి.సి. 1648)

**4. ఇప్పుడు గన్‌మాన్‌తో తిరుగుతుంటే మీ ఊరివాళ్ళు మీ ఊరి దళిత జనం ఏమంటున్నారు?**

మా ఊరి వాళ్ళు రామయ్యా నీకేమి, ఇక నీకు గన్‌మాన్ ఉన్నాడు. మన ఊరిలో కాపొల్లకి కరణమొల్లకే లేడు. పోలీసులపైనే కేసేసి గన్‌మాన్‌తో తిరుగుతుండావు అంటున్నారు. రామయ్యా స్టార్ పెరిగింది. రామయ్యని ఎవ్వరూ ఏమీ అనడానికి లేదు అంటున్నారు.

**5. ఇప్పుడు మీరే మనుకుంటున్నారు?**

అంబేద్కర్ అంత ఆయనకి కష్టాలు తప్పలేదు. నేనెంత అనుకుంటున్నాను. కానీ కష్టపడితే ఫలితముంటది ఏమయినా సాధించాలనుకుంటున్నాను. కేసు గెలవాలను కుంటున్నాను. మధ్యలో పోలీసోళ్ళు నాకు 60,70 వేలు ఇస్తామని బేరం పెట్టారు. నేను వినలేదు - తర్వాత కోర్టు చెప్పే వరకు నేను ఆమాటకే కట్టుబడి ఉంటాను. 5సం॥ల నా కూతురు నా యింట్లోనే ఉంది. యాదమ్మ ఇబ్రహీంపట్నంలో వాళ్ళ ఊళ్ళో ఉంది. కేసు కోర్టులో ఉంది. పదిమందికి ఒకలాగే న్యాయం ఉండాలి. ఎవర్నీ కులంపేరుతో చిన్నచూపు చూడకూడదు. నేను ఎవరికీ భయపడే పనిలేదు. కానీ నా పొలం పడావయింది. పట్టాపాసు పుస్తకాలు కుదవలోనే ఉన్నాయి. అయినా నా లాగే నావాళ్ళు ధైర్యంగా నిలబడి న్యాయాన్ని సాధించుకోవాలి.

- ఇంటర్వ్యూ : **జి.వి. రత్నాకర్**

*(➜ 5వ పేజీ తరువాయి ..... )*

పునాది దళిత స్త్రీలే. అణగద్రొక్కబడిన జాతుల్లోనే అనేక సాహిత్యా నిధులు దాగివున్నాయి. సున్నితమైన అనేక అంశాలు చీకటి స్త్రీ నాయక పాత్రలో వున్నప్పుడే అది సాధ్యమవుతుంది.

త్యాగం, కృషి, సమర్పణ వున్న దళిత స్త్రీ అసూయని, నియంత్రణని, పురుషాధిపత్యాన్ని, కులాధిపత్యాన్ని, ఎదుర్కొని తన ఆత్మగౌరవ ఉద్యమ బావుటా ఎగురవేస్తున్న కాలమిది. తన కూడు, గుడ్డ, నివాసంతో పాటు ప్రపంచంలో వున్న అన్ని రంగాల్లో తాను నిలబడి తన ఆత్మగౌరవాన్ని ఎగురవేయాలని హిమావత్ వంటి ఈ సమాజంలో ఒక్కొక్క అడుగువేస్తూ ముందుకు వెళ్ళుతున్న చైతన్యశక్తి దళిత స్త్రీ.

దళిత స్త్రీ ఉద్యమం అది సామాజిక, సాంస్కృతిక, తాత్విక, ఆర్థిక, రాజకీయ ఉద్యమం. అది ఈ రెండు దశాబ్దాల్లోనే బలంగా పిడికిలి బిగించింది. ఊరుని, వాడని దాటి నగరవీధుల్లో ఊరేగింపుగా వస్తుంది. ఇక దాన్ని ఎవరూ ఆపలేరు. దానితో కలిసి నడిచే హృదయం వుంటే, చావ వుంటే నడవటమే నేటి చారిత్రక కర్తవ్యం. ●

# దళితులపై జరిగిన అత్యాచార నేరాలు - జూన్ - 2005

**వరంగల్ :** 12.06.05న నర్సంపేట మండలం దళిత కాలనీలో దళిత సర్పంచ్‌గా ఉన్న భారతికి విధి నిర్వహణలో భాగంగా గ్రామసభ జరుగుతుండగా దార్ల రవీందర్ అనే వ్యక్తి ఆమెను కులం పేరుతో దూషించాడు.

12.06.05న నర్సంపేట మండలం దళిత కాలనీలో గ్రామ సర్పంచ్ దళితులను కులంపేరుతో దూషిస్తూ, దళిత స్త్రీలను అసభ్యకరమైన మాటలతో అవమానిస్తున్నాడు.

**మహబూబ్‌నగర్ :** 10.6.05న బాలానగర్ మండలం చెన్నవెల్లి గ్రామంలో కేశవులు (12) అనే బాలుడు భూస్వామి వద్ద పాలేరుగా పనిచేస్తూ భూస్వామి వేధింపులకు చెట్టుకి ఉరివేసుకుని మృతి చెందాడు.

10.6.05న అడ్డాకుల మండలం జానంపేట గ్రామంలో రాజమ్మ (40) అనే దళిత మహిళ చేతబడి చేస్తుందన్న నెపంతో గ్రామస్తులంతా కలిసి దాడిచేసి కొట్టి పళ్ళూడగొట్టారు.

**క్రిష్ణ :** మోమన్‌పేట మండలం పాతకోలుకుంద గ్రామానికి చెందిన దళితులను దళితేతరులు కులంపేరుతో దూషిస్తూ దుకాణాల్లో దళితులకు సరుకులివ్వకుండా, పశువులను మేపే పొలాల్లో వారిని వేధింపులకు గురిచేస్తున్నారు.

**విశాఖపట్నం :** 29.05.05న నర్సీపట్నం మండలం బయ్యపురెడ్డిపాలెం గ్రామంలో నూకరాజు (45) అనే దళితుడు బాణామతి చేస్తున్నాడన్న నెపంతో గ్రామస్తులంతా కలిసి దాడిచేసి కత్తులతో నరికి చంపారు.

**నిజామాబాద్ :** 27.07.05న నిజాంసాగర్ మండలం జక్కాపూర్ గ్రామానికి చెందిన రాములు (35) అనే దళితుడు గత మూడు నెలలుగా పస్తులుంటూ ఆకలితో మరణించాడు.

**కరీంనగర్ :** 22.06.05న మల్లాపూర్ మండలం గుండంపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన చలివేంద్రం వద్ద గ్లాసుతో మంచినీళ్ళు తాగాడని రాజరెడ్డి (50) అనే దళితుణ్ణి గంగాధర్ అనే వ్యక్తి గ్లాసును ఎంగిలి చేసావంటూ దాడిచేసి రాళ్ళతో, కర్రలతో గ్రామంలోని ప్రధాన రహదారి వెంట ఈడ్చుకుంటూ తీసుకెళ్ళి హత్యచేసాడు. అడ్డుకోవటానికి ప్రయత్నించిన వారినందరినీ చంపుతానని బెదిరించడంతో అందరూ చూస్తూ ఉండిపోయారు. నిందితుడు గతంలో అదే గ్రామంలో వెంకట రాజం అనే వృద్ధుణ్ణి హత్య చేశాడు.

**కడప :** పోరుమామిళ్ళ మండలం చిదానందమయ్య నగర్‌లో అల్లుబాబు (32) అనే దళితుడి ఇంటిపక్కన ఉన్న స్థలం విషయమై పోలీసులు దాడిచేసి, స్థలాన్ని ఖాళీచేయమని బెదిరిస్తున్నారు.

25.06.05న కమలాపురం మండలం పందిళ్ళపల్లె గ్రామంలో దళితమైనర్ బాలిక తల్లితో కలిసి వంటచెరకు కోసం ఊరిబయటకు వెళ్ళింది. వేరు వేరు పొదల్లో ఇద్దరూ కర్రలు కొట్టుకుంటుండగా పసుటూరు గంగాధర్ అనే వ్యక్తి బాలికపై అత్యాచార యత్నం చేశాడు. దూరంగా ఉన్న తల్లి బాలికను కాపాడుకుంది. జరిగిన విషయాన్ని ఇంటికి వచ్చి భర్తతో చెప్తుండగా గంగాధర్ మరికొంతమందిని వెంట పెట్టుకుని వచ్చి వారి ఇంటిపై దాడిచేసి, రాళ్ళతో కొట్టారు.

**మెదక్ :** 25.06.05న రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలో బూదవ్వ అనే దళిత మహిళను గ్రామస్తులంతా కలిసి అక్రమసంబంధం ఉందన్న అనుమానంతో వివస్త్రను చేసి, గుండు గీసి, తీవ్రంగా కొట్టారు. అడ్డొచ్చిన తన కుమారుడు స్వామి (10) ని కూడా కొట్టి, ఇంట్లో బట్టలు, 200 రూ॥లు డబ్బులు, 20 తులాల వెండిని ఎత్తుకెళ్ళారు.

**రంగారెడ్డి :** 24.06.05న మోమిన్‌పేట మండలం పాతకోలుకుంద గ్రామంలో మంచినీటి బోరు విషయమై దళితులను చంద్రశేఖర్, రాజు, రాములు, రవి మహిపాల్‌తో పాటు మరో 5గురు కులం పేరుతో దూషించారు.

# దళితులపై జరిగిన అత్యాచార నేరాలు - జూలై - 2005

**మహబూబ్‌నగర్ :** 28.07.05న శాంతినగర్ మండలం రాజోలి గ్రామంలో గంగన్న (50) అనే దళితుడు అనారోగ్యంతో మరణిస్తే దళితులు స్మశానవాటికకు తీసుకెళ్తుండగా బిసి కులానికి చెందిన కొందరు తమ స్మశానవాటికకు దగ్గరగా దళితుల్ని ఖననం చేయటానికి వీల్లేదని దళితులను అడ్డుకుని అవమానించారు.

**ప్రకాశం :** 25.07.05న టంగుటూరు మండలం జమ్ములపాలెం గ్రామంలో రఘురామయ్య అనే దళితుడు అదే గ్రామానికి చెందిన పులివర్తి వెంకటేశ్వర్లు అనే పొగాకు వ్యాపారి దగ్గర కారుడ్రైవరుగా పనిచేస్తున్నాడు. యజమాని బంధువుతో డ్రైవర్‌కు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో యజమాని పథకం ప్రకారం డ్రైవరును హత్యచేయించాడు.

**గుంటూరు :** 26.07.05న కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామంలో రెవిన్యూ మిగులు భూములను దళితులకు పంపిణీచేస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో భూపోరాట కమిటీ నాయకులు మిగులు భూముల జాబితాను అధికారులకు అందించారు. దాంతో గ్రామంలోని దళితేతరులంతా దళితులను సాంఘికంగా బహిష్కరించి, పనులకు పిలవకుండా ఇబ్బందులకు గురిచేశారు.

**తూర్పుగోదావరి :** 12.07.05న ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో దళితులు వ్యవసాయ కూలీలసంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారని సంఘం విడిచిపెట్టాలని ఆదేశిస్తూ వారిని సాంఘికంగా బహిష్కరించారు.

**చిత్తూరు :** పిటిఎం మండలం బెట్టకొండ గ్రామంలో దళితేతరులకు సంబంధించిన చావుకు కొమ్ము ఊదటానికి దళితులు వెళ్ళలేదని బయ్యారెడ్డి అనే వ్యక్తి అతని అనుచరులు కలిసి దళితుల గొర్రెలను దొంగిలించి వారిపై దాడిచేసి కొట్టారు.

**ఆదిలాబాద్ :** 23.07.05న జన్నారం మండలం రిజర్వు ఫారెస్టులో వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులను ఫారెస్టు అధికారులు కులం పేరుతో దూషించారు.

**నెల్లూరు :** 6.07.05న చిల్లాకూర్ మండలం కలవకొండ గ్రామంలో వెంకటసుబ్బయ్య అనే దళితుడు అతని స్థలంలో పెంచుకున్న చెట్లు పక్క స్థలానికి చెందిన నెల్లూరు శ్రీనివాసులు అనే భూస్వామి చెట్లు తన భూమిలో ఉన్నాయని తనకే చెందుతాయని గొడవపడి తప్పుడు కేసుపెట్టి సుబ్బయ్య తమ్ముణ్ణి జైలుకి పంపి, సుబ్బయ్యను కర్రలతో కొట్టి చంపారు.

**మెదక్ :** మనూరు మండలం కారముంగి గ్రామానికి చెందిన విఠల్‌రావు అనే దళితుణ్ణి బాపురావు అనే దళితేతరుడు కులం పేరుతో దూషించాడు.

**విశాఖటప్నం :** 11.07.05న మద్దిలపాలెం మండలం నందిగాం గ్రామానికి చెందిన విజయకేశరావు అనే దళితుడి వద్ద పరీక్ష పాస్ చేయిస్తానని బి.ఇడి కళాశాల యాజమాన్యం కొంత డబ్బు తీసుకుని పరీక్ష ఫెయిల్ చేశారు. దాంతో విజయకేశవరావు ప్రిన్సిపాల్ అడిగినందుకు కులంపేరుతో దూషించాడు.

*రెండువేల సంవత్సరాల దళితుల దుఃఖపు గాథ ఇది. మతమనే పేర బ్రాహ్మణుల పద్మవ్యూహంలో మీరు చిక్కుకుపోయారు. మీ అనంతమైన దుఃఖాన్ని చూసి నా హృదయం ద్రవించిపోతుంది. ఆ దుఃఖం తొలగే ఉపాయం ఒకటుంది. అదే విద్య. విద్యలో మానవత్వం సిద్ధించి పశుత్వం నశిస్తుంది. మీరందరూ సరిగా వినండి మనకొక శత్రువున్నాడు. ఆ శత్రువు పేరే అజ్ఞానం. మిత్రులారా వినండి. అంటరాని రక్త బంధువులారా చైతన్యవంతులు కండి. బానిస సంకెల్లని తుత్తునియలు చేసేందుకు కదం తొక్కి కదలండి. విద్యకోసం నినదించండి.*

**- సావిత్రీబాయి ఫూలే**

## పోస్టుమార్టమ్ పోస్టుపోనవుతూనే ఉంది ...

...✍ జె. ఇందిర

**ను**వు ఏరుదాటుతానన గానే
తెప్పెవరు తగలేసారు సునీతా?
ఈ సుడిగుండాల రాజ్యంలో
ఎక్కడ మునిగిపోయావ్?
నిను వెతకడానికి మాకు
రెండుదారులు దొరికాయి
ఒకదారివారేమో కలంలో నిన్ను వెతుకుతున్నారు
ఇంకోదారి వారేమో గేలాలు, వలలు పట్టుకుని
నిన్ను ఎక్కడపట్టాలో అక్కడ పడతామంటున్నారు
వారి పట్టకారు పళ్ళ కింద వేటరక్తం కారుతోంది !

మామూలు మామూలుగానే వసూలైంది
జైలు తలుపు వీలుగానే వదులైంది
నీ మీద పెట్టిన ఐస్‌ముక్క
కరిగినంతసేపు కూడా పట్టలేదు సునీతా !
కుళ్ళితే ఏశరీరమైనా కంపుకొడ్తుంది
గిల్లితే ఎవరికైనా నొప్పెడుతుంది
మరి నీ కథెందుకు సునీతా కంచెకి పంపేస్తున్నారు?

ఎవరికివారే శవాలైతే తప్ప
ఒకర్నొకరు భరించుకోలేని స్థితా ఇది?!
బహుశా నువు కంచె ముళ్ళకి వేలాడితే
వీరు గంధం ముక్కలతో తగలబడతారేమో !
నీతి బాహ్యమై పోయేవని ఏహ్యపడుతున్నట్టున్నారు
మగవీధి మొగల్లో కాపలాని
వెక్కిరించే పారపోయావని తెల్సుకోవడం
వ్యక్తిగతంగా చచ్చేవారికి అర్థమవ్వడం కష్టమని అర్థమైంది !

నువు నీతిని, జాతిని చీదరించుకున్నావ్ సునీతా !
మేం ఎక్కడెక్కడ కుళ్ళిపోయామో
తెల్సుకోడానికి ఇంకా రిపోర్ట్ అందలేదు
మా పోస్టుమార్టమ్ పోస్టు పోనవుతూనే ఉంది !!

*(సెంట్రల్ యూనివర్సిటీలో 1995లో ఆత్మహత్య చేసుకున్న దళిత విద్యార్థిని సునీత కోసం)*

●

*మీ అభిప్రాయాలను కింది చిరునామాకు పంపండి.*

**సాక్షి**

**హ్యూమన్ రైట్స్ వాచ్, ఎ.పి.**
**ఇం.నెం. 10-1-564, టి.ఐ.టి., బ్లాక్ - 50.**
**వెస్ట్ మారేడుపల్లి, సికింద్రాబాద్ - 500 026.**

**ఫోన్ : 040 - 27801368**
**ఫ్యాక్స్ : 040 - 27715086**
**ఇ-మెయిల్ :** Sakshi_ap@satyam.net.in
**వెబ్‌సైట్ :** www.sakshiap.org

**BOOK - POST**

Printed Matter

To

Published by Dr. S.D.J.M Prasad Director, Sakshi Human Rights Watch, A.P. Secunderabad - 500 026.